ఆదివారం
22-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 122
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికన్ తల్లీకూతురిని విడిచిపెట్టిన హమాస్

జెరూసలేం: మానవతా కోణంతో అమెరికాకు చెందిన తల్లీకూతురిని తమ చెర నుంచి హమాస్ విడుదల చేసింది. ఈనెల 7న ఇజ్రాయిల్‌పై దాడి క్రమంలో ఈ ఇద్దరిని బందీలుగా చేసుకుంది. హమాస్ విడిచిపెట్టిన తల్లి, కుమార్తెకు ఇజ్రాయిల్ పౌరసత్వం కూడా ఉంది. ఇజ్రాయిల్ అధికారుల వద్ద ఇజ్రాయిల్‌లోనే వీరిద్దరు సురక్షితంగా ఉన్నారు. ఖతార్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారిని విడుదల చేస్తున్నట్లు హమాస్ తెలిపింది. తమ పౌరుల విడుదలను స్వాగతిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తెలిపారు.

కాలుష్య కోరల్లో కొల్లేరు

- యదేచ్ఛగా కోళ్ల వ్యర్థాల రవాణా
- రొయ్యల రైతుల ఆందోళన
- అక్రమార్కులకు కాసుల వర్షం
- పట్టించుకోని ఏలూరు జిల్లా యంత్రాంగం

విశాలాంధ్ర-భీమడోలు : తాము అధికారంలోకి వస్తే కొల్లేరును ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, కొల్లేరును పరిరక్షిస్తామంటూ వాగ్దానం చేసిన నాయకుల మాటలు నీటిమూటలయ్యాయి. కాలుష్య కోరల్లో కొల్లేరు చిక్కుకున్నా... కాపాడవలసిన యంత్రాంగం కన్నెత్తైనా చూడడం లేదు. దీంతో ప్రసిద్ధిగాంచిన కొల్లేరు మంచినీటి సరస్సు అక్రమార్కుల కబంధహస్తాలు, కాలుష్య కోరలలో చిక్కుకుంది. ఏలూరు జిల్లా మండలంలో ఉన్న కొల్లేరు ప్రాంతంలో చేపల పెంపకం దారులు ప్రతిరోజూ ప్రతిరోజు టన్నుల కొలది కోళ్ల పేగులు, తల, చర్మం వంటి వ్యర్థాలను ఉపయోగిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. వాటిని నిరోధించిన దాఖలాలు మచ్చుకైనా కానరావడం లేదు. కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను నిరోధించదానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు లేవు. జిల్లా స్థాయిలో అధికారులు స్పందించినప్పుడు మాత్రం నామమాత్రపు తనిఖీలతో కూడిన హడావుడి చేయడం తప్ప చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదు. కోళ్ల వ్యర్థాలు సరఫరా చేసే వాహనాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోని పరిశ్రమల్లోని వ్యర్థాలన్నీ కొల్లేరు ప్రాంతాలకు చేరవేసి ప్రతి రోజూ లక్షల రూపాయలు అక్రమ మార్గంలో సంపాదిస్తున్న వారిపై ఏ ఒక్క పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాదు. చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే కంటైనర్ బాక్సులను కొనుగోలు చేసి, వాటి ద్వారా ఎవరికి కనపడకుండా కోళ్ల వ్యర్థాలను భీమడోలు మండలంలోని చింతపాడు, చెట్టున్నపాడు, మల్లవరం, ఆగడాల లంక,

- మిగతా 2 లో

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

- ఎన్నికల రాష్ట్రాల్లో నేతల అంతర్గ పోరు
- టికెట్ల కోసం రగడ
- రాజస్థాన్‌లో గహ్లోత్, పైలట్ మధ్య విభేదాలు
- మధ్య ప్రదేశ్‌లో కమల్‌నాథ్ వర్సెస్ దిగ్విజయ్
- ఆందోళనలో అధిష్ఠానం

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీని కలవరపెడుతున్నాయి. నేతల మధ్య విభేదాలు, కుమ్ములాటలు పెరిగిపోయాయి. నేతల అంతర్గత పోరు ఏ పరిణామాలకు దారితీస్తుందోనని అధిష్ఠానం ఆందోళన చెందుతోందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గపోరును పరిష్కరించడంలో అధిష్ఠానం విఫలమైంది. రాజస్థాన్‌లో సీఎం అశోక్ గహ్లోత్, యువనేత సచిన్ పైలట్ మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో అంతర్గతంగా ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయని, టికెట్ల కేటాయింపు సమయంలో రెండు వర్గాల మధ్య విబేధాలు బయటపడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, మధ్య ప్రదేశ్‌లో పార్టీ సీనియర్ నేతలైన మాజీ సీఎంలు దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్ వ్యవహారం పార్టీకి తలనొప్పిగా మారింది. టికెట్ల కేటాయింపు విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు నెలకొన్నాయి. తాజాగా తన వర్గం నేత వీరేంద్ర రఘువంశికి శివపురి నుంచి టికెట్ ఇవ్వకపోవడం పట్ల

- మిగతా 2 లో

ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఏదీ?

- నిరాశపరచిన సీఎం కర్నూలు జిల్లా పర్యటన
- నోరు మెదపని స్థానిక ప్రజాప్రతినిధులు
- ఓట్లు కావాలి... మా సమస్యలు పట్టవా? అని ప్రజల ఆవేదన
- మంత్రులు, ప్రజాప్రతినిధులను అడ్డుకుంటాం : సీపీఐ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఏదీ? అని కర్నూలు జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోంది. ఖరీఫ్ పూర్తయి రబీ ప్రారంభ దశలో ఉన్నా చినుకు జాడలేదు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి జిల్లాలోని ఎమ్మిగనూరులో చేదోడు పథకంలో నాలుగో విడత కార్యక్రమానికి వస్తున్నాడని తెలిసిన జిల్లా వాసులు ఎంతో ఆశగా సీఎం హామీ కోసం ఎదురు చూశారు. సీఎం కనీసం జిల్లాలో నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకొని కరువు జిల్లాగా ప్రకటిస్తారని ఆశించారు. రైతులు ఖరీఫ్‌లో పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో చేసిన రుణాలు మాఫీ చేస్తారని వ్యవసాయమే జీవనాధారమైన పశ్చిమ ప్రాంత

- మిగతా 2 లో

'గగన్‌యాన్' సాకారానికి ముందడుగు

- 'టీవీ-డీ1' పరీక్ష విజయవంతం
- చివరి నిమిషంలో తలెత్తిన సాంకేతిక లోపం
- సరిచేసి ప్రయోగించిన ఇస్రో

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష మిషన్ 'గగన్‌యాన్' సాకారం దిశగా మరో ముందడుగు పడింది. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టుకు కీలకమైన 'టెస్ట్ వెహికిల్ అబార్ట్ మిషన్' (టీవీ-డీ1) పరీక్ష శనివారం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట, సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఉదయం 10 గంటలకు 'సింగిల్ స్టేజ్ లిక్విడ్ రాకెట్' నింగిలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత

- మిగతా 2 లో

పోలీసులకు కొత్త సవాళ్లు

- ఖాకీ డ్రెస్ అంటేనే త్యాగనిరతి
- సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ మన విధానం
- శాంతి భద్రతలకు అత్యధిక ప్రాధాన్యత
- పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో సీఎం

2 లో

హైకోర్టు న్యాయమూర్తులుగా నలుగురు ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్

30కి చేరిన జడ్జిల సంఖ్య

2 లో

ఎస్టీయూ ఆక్రందన దీక్షలు

- పెండింగ్ బకాయిలు చెల్లించాలని నినాదాలు
- మోకాళ్లపై నిలబడి నిరసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిల చెల్లించాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రోపాధ్యాయ సంఘం-ఆంధ్ర ప్రదేశ్ (ఎస్టీయూ-ఏపీ) అధ్వర్యంలో 26 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట శనివారం ఆక్రందన దీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. సాయి శ్రీనివాస్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోను, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న కర్నూలు జిల్లాలోని ధర్నా చౌక్ దగ్గర చేపట్టిన ఆక్రందన దీక్షలకు ముఖ్య అథులుగా హాజరయ్యారు.

పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలన్న నేతలు, ఉపాధ్యాయుల నినాదాలతో ఆక్రందనల దీక్షా శిబిరాలు మారుమోగాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు, మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గాల్లోకి నల్ల బెలూన్లని ఎగరవేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేతలు సాయిశ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 13లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించకుంటే ఈ ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయినట్లేనని, అందుకే ఈ ప్రభుత్వాన్ని వ్యతిరేకించదానికి ఉపాధ్యాయులకు సవాలక్ష కారణాలు ఉన్నాయని చెప్పారు.

రాష్ట్రంలో పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయుల ఆర్జిత సెలవు బకాయిలు రూ.800 కోట్లు, భవిష్య నిధి, జీవిత బీమా, కరువు భత్యం, 11వ పీఆర్సీ బకాయిలు మొత్తంగా పేరుకుపోయిన దాదాపు 3 వేల కోట్ల రూపాయల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. ఆర్థిక బకాయిల చెల్లింపు పైన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ,

- మిగతా 2 లో

టీడీపీ-జనసేన కూటమికి 160 స్థానాలు ఖాయం

- జగన్ రెడ్డి కుట్ర రాజకీయాలను తప్పుబడుతున్న వైసీపీ ఎంపీలు
- చేయని తప్పుకు చంద్రబాబును జైలుకు పంపారు
- ఎన్నికలకు ఐదు నెలలే సమయం
- వైసీపీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి: టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో లోకేశ్

3 లో

ఇదీ లోకం!

మితిమీరిన స్మృతి ఇరానీ అజ్ఞానం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆకలి సూచీలో భారత్ స్థానం గతంలో కంటే పడిపోయింది. దాయాది దేశమైన పాక్, పొరుగు దేశమైన బంగ్లాదేశ్ కంటే అధ్వాన్న స్థానంలో నిలిచింది. దీంతో సర్వత్రా విమర్శలు వస్తుండగా తమ తప్పులను

- మిగతా 2 లో

రాజస్థాన్ అభ్యర్థుల ఎంపిక రసవత్తరం

- జాబితాలు ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ
- ఝుల్రాపటన్ నుంచి వసుంధర రాజే
- సర్దార్‌పూర్ నుంచి గహ్లోత్... టోంక్‌లో సచిన్ పైలట్

న్యూఢిల్లీ: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, బీజేపీ శనివారం అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో రెండు పార్టీలు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. గెలిచే వారినే బరిలో దించాలనే ఆలోచనతో వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ శనివారం 33 మందితో అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేయగా, బీజేపీ కూడా 83 మందితో రెండవ జాబితాను ప్రకటించింది. కాగా, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే ఈ ఎన్నికల్లో పోటీ చేయడంపై గత కొంత కాలంగా నెలకొన్న సందిగ్ధత తొలగింది. అనేక ఊహాగానాలకు తెరదించుతూ బీజేపీ రెండవ జాబితాలో రాజే పేరును ప్రకటించారు. ఆమె తన కంచుకోట ఝుల్రాపటన్ నుంచే బరిలోకి దిగుతున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఆమె ఇప్పటికే నాలుగు సార్లు విజయం సాధించారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు 33 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సర్దార్‌పూర్

- మిగతా 2 లో

గవర్నర్ కాన్వాయ్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెడతారా ?

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కాన్వాయ్ పేరుతో విజయవాడ ఎనికేపాడు సెంటర్ దగ్గర ట్రాఫిక్‌ను నిలిపివేయడం తగదని, దీనివల్ల గంటపాటు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ ఎనికేపాడు సెంటర్ ప్రాంతం నుంచి గవర్నర్ కాన్వాయ్ వస్తుందనే పేరుతో వాహనాలను నిలిపేశారు. దీంతో గన్నవరం నుంచి విజయవాడకు వచ్చే వాహనాలన్నీ అక్కడ గంటలకొద్దీ బారులు తీరి, ప్రయాణీకుల రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే ప్రాంతం నుంచి

- మిగతా 2 లో

విశాలాంధ్ర
ప్రపంచం
2
ఆదివారం
22 అక్టోబరు 2023

పలస్తీనాకు చావు లేదు

ఆస్ట్రేలియాలో భారీ ప్రదర్శనలు

సిడ్నీ: గాజాపై ఇజ్రాయిల్ భీకర పోరులో వేలాది మంది పలస్తీనా ప్రజలు ముఖ్యంగా చిన్నారులు మృత్యువాత పడుతుండటం యావత్ ప్రపంచాన్ని కలచివేస్తోంది. ముస్లిం సమాజాన్ని కదిలించింది. దీంతో అన్ని దేశాల్లో పెద్దఎత్తున పలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. శనివారం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో పలస్తీనాకు మద్దతుగా 15వేల మంది కదం తొక్కారు. పలస్తీనా యాక్షన్ గ్రూపు అధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో 'పలస్తీనాకు చావులేదు' అన్న నినాదాలు మార్మోగాయి. పలస్తీనా జెండాలు ప్రదర్శించారు. పలస్తీనా ప్రజలు మా తోబుట్టువులు, వాళ్ల బహిరంగ మారణహోమాన్ని ఎదుర్కొంటున్న అంటూ నిరసనకారులలో ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు. పలస్తీనాలో ఏం జరుగుతోందో తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. ఇజ్రాయిల్ ఏం చేస్తుందో తెలిస్తే ప్రతి ఒక్కరు పలస్తీనాకు అండగా నిలుస్తారని మరొకరు అన్నారు. మానవీయకోణంలోనే ప్రదర్శనలో పాల్గొన్నా, మానవతానికి మద్దతిస్తున్నా అని ఇంకొకరు చెప్పుకొచ్చారు. రాజధాని నగరంలో పలస్తీనా అనుకూల ప్రదర్శనలు పెద్దఎత్తున జరిగిన క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అశ్వికదళాన్ని, పెట్రోలింగ్ హెలికాప్టర్‌ను రంగంలోకి దించారు. ప్రదర్శన శాంతియుతంగా జరిగిందని, ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. సిడ్నీతో పాటు బ్రిస్బేన్, పెర్త్, హోబర్ట్‌లోనూ భారీ ప్రదర్శనలు జరిగాయి.

తక్షణమే ఈజిప్టు, జోర్డాన్‌ను వీడండి

తమ పౌరులకు ఇజ్రాయిల్ సూచనలు



జెరూసలేం: ఈజిప్టు, జోర్డాన్‌ను తక్షణమే వీడాలని తమ పౌరులకు ఇజ్రాయిల్ శనివారం పిలుపునిచ్చింది. గాజాలో యుద్ధం తీవ్రమవుతున్న క్రమంలో ప్రాదేశిక ఘర్షణలు పెరుగుతుండటంతో ఈ మేరకు ఆదేశాలను ఇజ్రాయిల్ జాతీయ భద్రతా మండలి జారీచేసింది. నాల్గో ప్రమాద హెచ్చరికలు చేసింది. ఆ దేశాలకు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారంతా తక్షణమే తలరిపోవాలని తాజా ప్రకటనలో తెలిపింది. ఇటీవల టర్కీలోని తమ దౌత్యాధికారులను ఇజ్రాయిల్ వెనుక్కు పిలిపించిన విషయం తెలిసిందే.

హమాస్‌ను తుదిముట్టించడమే లక్ష్యంగా గాజాపై బాంబులను ఇజ్రాయిల్ కురిపిస్తోంది. మారణహోమం సృష్టిస్తోంది. యుద్ధంలో 4,137 మంది పలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోగా ఇందులో చిన్నారులు ఎక్కువ మంది ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

కాలుష్య కోరల్లో కొల్లేరు

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎం పురం, సాయం పాలెం, తోకలపల్లి గ్రామాలలో చేపల రైతులు కోళ్ల వ్యర్థాలను విచ్చలవిడిగా చెరువులలో చేపలకు మేతగా వేస్తున్నారు. దీంతో రొయ్యల చెరువులకు వైరస్ సంక్రమించి రొయ్యల రైతులు కోలుకోలేని నష్టాలలో కూరుకుపోయారు.

సాగు ఖర్చుకు ఆక్వా రైతుల కక్కుర్తి

ఆక్వా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు తక్కువ ధరకు లభించే కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వాడుతున్నారు. ఆ చేపలను తింటే పోషకాల మాట అటు ఉంచితే, అనారోగ్యం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగు ఖర్చును తగ్గించుకునేందుకు మేతకు బదులు కోళ్ల వ్యర్థాలను అందిస్తున్నారు. సాధారణంగా నీటిలో తేలియాడే మేత ధర కిలో రూ.35 నుంచి 40 పలుకుతోంది. ఎకరా చెరువులో ఏడు వేల చేప పిల్లలను వదిలి ఆరు నెలలు సాగు చేసేందుకు రూ.3.05 లక్షలు ఖర్చు అవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే రూ.1 లక్ష లోపే ఖర్చు అవుతుంది. 30 కిలోల వ్యర్థాల టిన్ను రూ.300 లకే లభిస్తోంది.

కాసులు కురిపిస్తున్న కోళ్ల వ్యర్థాల రవాణా

కోళ్ల వ్యర్థాల రవాణా అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. వ్యర్థాలు రవాణా చేసేవారు మాంసం విక్రేతలకు నెలకు రూ.5 వేల చొప్పున ముందుగానే చెల్లిస్తారు. మాంసం దుకాణాలలో మిగిలే వ్యర్థాలను అర్ధరాత్రి వేళ ఆటోలు,

ట్రక్కులల్లో చెరువుల వద్దకు చేరుస్తారు. టిన్ను రూ.300 చొప్పున విక్రయిస్తారు. ఆటోలు రాగానే చేపల రైతులు వ్యర్థాలను చెరువుల్లో విసిరేస్తున్నారు. మరికొందరు ఉడకబెట్టిన తరువాత చెరువులలో మేతగా వాడుతున్నారు. చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలను ఉపయోగించడం వలన ఇటు ప్రజల ఆరోగ్యం, అటు పర్యావరణానికి ముప్పు వాటిల్లేలా చేస్తున్నారు.

చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలను నిల్వ ఉంచడం వలన వైరస్ విస్తరించి పరిసరాలలో ఉన్న ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటున్నాయి. భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణానికి నష్టం కలుగజేస్తున్నారు. కొన్ని చోట్ల మూడు నాలుగు రోజులపాటు నిల్వ ఉంచిన కోళ్ల వ్యర్థాలను తరలించే క్రమంలో వాయు కాలుష్యం పెరిగిపోతోంది.

వ్యర్థాలు తీసుకువెళ్లే వాహనాలు వెళ్లిన మార్గంలో కనీసం 10 నుంచి 20 నిమిషాల వరకు భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

జీవో అమలు ప్రశ్నార్థకం...?

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తున్న వ్యర్థాల రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తూ 2016 డిసెంబరు 4న జీవో నంబరు 56 విడుదల చేసింది. మండల స్థాయిలో తహసీల్దారు చైర్మన్‌గా, వీఆర్వో, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారి సభ్యులుగా, మెంబర్ కన్వీనర్‌గా ఫిషరీస్ అధికారి వ్యవహరిస్తారు. ఈ కమిటీలపై పర్యవేక్షణ అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. వ్యర్థాలు రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడితే డ్రైవర్ల లైసెన్సు, రవాణా పర్మిట్లు రద్దు చేసి, వాహన యజమాని, డ్రైవర్లపై ఐపీసీ కేసులు నమోదు చేస్తారు. చేపల చెరువు లైసెన్స్ రద్దు, రూ.10 వేల జరిమానా విధించవచ్చు. కానీ ఇవేమీ ఎక్కడా అమలు కానరావు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కోళ్ల వ్యర్థాలను సరఫరా చేసే అక్రమార్కుల భరతం పట్టాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా తాత్కాలిక పర్యవేక్షణ చేసి చేతులు దులుపుకున్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించి కోళ్ల వ్యర్థాలను సరఫరా చేస్తున్న వారిపై, వినియోగించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కొల్లేరు ప్రాంతంలో శాశ్వతంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కొల్లేరును పరిరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులుగా నలుగురు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ, సుమతి జగడం, న్యాపతి విజయ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, హోం మంత్రి తానేటి వనిత, మంత్రి అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, హైకోర్టు న్యాయమూర్తులు తదితరులు హాజరయ్యారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల పోస్టులు ఉండగా ప్రస్తుతం 27 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు బదిలీ కాగా కర్నాటక నుంచి జస్టిస్ నరేందర్ బదిలీపై ఏపీ హైకోర్టుకు వస్తున్నారు. ఇక, కొత్తగా నియమితులైన నలుగురితో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి పెరిగింది.

ప్రజలను ఇబ్బంది పెడతారా ?

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్న నారాయణ ఈ సమస్యను ప్రత్యక్షంగా గమనించారు. నారాయణ మాట్లాడుతూ, గవర్నర్ కాన్వాయ్ వస్తోందనే పేరుతో ఎనికేపాడు సెంటర్ దగ్గర గంట పాటు ట్రాఫిక్ నిలిపేయడాన్ని తప్పుపట్టారు దీనివల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని, వాహనాలు ముందుకు కదల లేదన్నారు. ఇక్కడ ఒకే ఒక్క ట్రాఫిక్ పోలీసు ఉన్నారని, మిగిలిన వాళ్లంతా ఏమయ్యారని సూటిగా ప్రశ్నించారు. కేవలం ఒకే పోలీసును పెట్టి, అటువైపు గవర్నర్ కాన్వాయ్ వస్తుందని హడావిడి చేయడాన్ని తప్పుపట్టారు. ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టే హక్కు గవర్నరుకు లేదన్నారు. గవర్నరే ఇలా చేస్తే ఎలా ?, ఇలా అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంకా అరాచకం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గవర్నర్ కు బంగ్లా ఇచ్చారని, అందులో హాయిగా ఉండాలి కదా ?, అని సూచించారు. ఇలా రోడ్లపై కాన్వాయ్ తో పర్యటిస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలను నారాయణ తీవ్రంగా ఖండించారు.

రాజస్థాన్ అభ్యర్థుల ఎంపిక రసవత్తరం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి బరిలోకి దిగుతుండగా, మరో నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంక్ నుంచి పోటీ చేస్తున్నారు. స్పీకర్ సి.పి.జోషి తన నాథ్‌ద్వారా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనుండగా, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతస్రా లచ్మాన్‌గఢ్ నుంచి బరిలోకి దిగుతున్నారు. మంత్రి హరీష్ చౌదరి బేటూ నుంచి, మమతా భూపేష్ సిక్రాయ్-ఎస్సీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. మరిన్ని స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు కేంద్ర ఎన్నికల కమిటీ ఆదివారం సమావేశం కానున్నందున కాంగ్రెస్ ఇంకా మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. ఇక బీజేపీ మరో 83 మంది అభ్యర్థులను ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే తన సాంప్రదాయ ఝాల్రాపటన్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. బైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు, ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న నర్పత్ సింగ్ రాజ్వీ విద్యాధర్ నగర్ స్థానం నుంచి మళ్లీ నామినేషన్ వేయడాన్ని నిరాకరిస్తూ చిత్తోర్‌గఢ్ నుంచి పోటీకి దింపాలని పార్టీ నిర్ణయించింది. దీంతో ఒక వర్గం పార్టీ కార్యకర్తల నుంచి ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై రాజ్వీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే బీజేపీ నాయకత్వం అతని అభ్యర్థిత్వంపై నష్ట నివారణ కసరత్తుగా పరిగణించింది. ఈ పేర్లలో ఇటీవల పార్టీలో చేరిన మహారాణా ప్రతాప్ సింగ్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవార్ కూడా ఉన్నారు. 2018లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సి.పి.జోషి గెలుపొందిన నాథ్‌ద్వారా అసెంబ్లీ స్థానం ఆయన పోటీ చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సతీష్ పూనియా ప్రస్తుతం రాజస్థాన్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న అంబర్ నుంచి పోటీ చేస్తున్నారు. అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో దాని నాయకుడు రాజేంద్ర రాథోడ్ పేరు కూడా ఉంది. ఇదిలాఉండగా, 200 మంది సభ్యుల అసెంబ్లీకి నవంబరు 25న జరగనున్న రెండో జాబితాతో బీజేపీ ఇప్పటివరకు 124 మంది అభ్యర్థులను ప్రకటించింది.

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

(మొదటిపేజీ తరువాయి)

కమల్‌నాథ్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వెళ్లి దిగ్విజయ్ బట్టలు చింపండి' అంటూ... కార్యకర్తలను ఆయన ఉసిగొల్పడం చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన డిగ్గీరాజా 'పెద్దలకు వివేకం ఉండాలి' అంటూ చురకలంటించారు.

రాజస్థాన్‌లో తారస్థాయికి కలహాలు

రాజస్థాన్‌లో 2018లో అధికార పీఠమెక్కిన నాటి నుంచి అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ వర్గాలు కొట్లాడుకొంటున్నాయి. గహ్లోత్‌పై సచిన్ పైలట్ దాదాపు 20 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేశారు. దీంతో ఆయనను ఉప ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అధిష్ఠానం తొలగించింది. అవినీతిపై పోరాటం పేరుతో సొంత పార్టీ సీఎం పైనే పైలట్ రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపట్టారు. కాగా, తాజాగా అశోక్ గహ్లోత్ సీఎం పదవిపై తనకున్న వ్యామోహాన్ని బయటపెట్టారు. దిల్లీలో మాట్లాడుతూ 'నన్ను నాలుగోసారి సీఎంగా చూడాలని అనుకుంటున్నట్టు ఇటీవల ఓ మహిళా కార్యకర్త నాతో చెప్పింది. నేను సీఎం పదవిని వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. కానీ సీఎం పదవి నన్ను వదలడం లేదని ఆమెతో చెప్పాను' అని మరోసారి తానే సీఎం అభ్యర్థినని గహ్లోత్ చెప్పకనే చెప్పారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి.

టికెట్లపై ఎవరి మాట నెగ్గుతుందో?

టికెట్ల పంపిణీలో గహ్లోత్, పైలట్ మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ అనుయాయులకు టికెట్ ఇప్పించుకొంటారా? ఎవరి మాట నెగ్గుతుందనేది ఆసక్తికరంగా మారింది. రాజస్థాన్‌లో అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు బుధవారం నిర్వహించిన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశానికి సచిన్ పైలట్‌ను ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది. కాగా, సచిన్ పైలట్ సీడబ్ల్యూసీ సభ్యుడిగా అధిష్ఠానం ఎంపిక చేయడంపై ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో గహ్లోత్ స్పందిస్తూ, ఇప్పుడు ఆయనే హైకమాండ్ అయ్యారని, టికెట్ల కేటాయింపులో ఆయన పాత్ర ఉండొచ్చని వ్యాఖ్యానించారు.

మధ్య ప్రదేశ్‌లో ప్రభుత్వంపై వ్యతిరేకతను సొమ్ము చేసుకొనేనా?

మధ్యప్రదేశ్ విషయానికొస్తే అక్కడ శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకొని అధికారంలోకి వద్దామనుకొంటున్న కాంగ్రెస్‌కు... కమల్‌నాథ్, దిగ్విజయ్ మధ్య విభేదాలు తలనొప్పిగా మారాయి. అభ్యర్థుల ఎంపికలో అపార్థాలు, తప్పులు జరుగుతున్నాయంటూ మంగళవారం టికెట్ ఆశావహుడు వీరేంద్ర మద్దతుదారుల ఆందోళన సందర్భంగా దిగ్విజయ్‌ను ఉద్దేశించి కమల్‌నాథ్ వ్యాఖ్యలు చేశారు. వీరేంద్రకు టికెట్ దక్కాలని తాను కోరుకొంటున్నానని, అయితే అది జరుగలేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో మరో నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని నేతల మధ్య ఐక్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పోలీసులకు కొత్త సవాళ్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆధునిక టెక్నాలజీ వల్ల సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సైబర్ సెక్యూరిటీ నుంచి డేటా థెఫ్ట్ వరకు, డేటా థెఫ్ట్ నుంచి సైబర్ హెరాస్‌మెంట్ వరకు ప్రతి అంశంలోనూ నేరాలన్నీ నిరోధించడానికి, వాటి మీద దర్యాప్తు చేసి శిక్ష వేయడానికి పోలీసులు అనేక కొత్త సవాళ్లు ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అమరులు వారు అనే పుస్తకాన్ని ఆవిష్కరించి, పోలీస్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ ఖాకీ డ్రెస్ అంటేనే త్యాగ నిరతి అని కొనియాడారు. ఆ డ్రెస్ మీద ఉన్న మూడు సింహాలు మన దేశ సార్వభౌమాధికారానికి చిహ్నం. పోలీస్ అంటే అధికారం మాత్రమే కాదు. అంతకుమించి పోలీస్ అంటే ఒక బాధ్యత కూడా. ఈ ఉద్యోగం ఒక సవాల్. మరీ ముఖ్యంగా నేరం వేగంగా తన రూపాన్ని మార్చుకుంటున్న ఈ యుగంలో అంతకుమించిన వేగాన్ని అందుకుంటేనే పోలీసింగ్‌కు విలువ ఉంటుందన్నారు. స్మార్ట్ ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడకం వల్ల సైబర్ ప్రపంచంలో మరో చీకటి ప్రపంచం సృష్టించుకుని నేరాలు చేస్తున్న వాళ్లను ఎదుర్కొవాల్సిన ఒక బృహత్తర బాధ్యత కూడా పోలీసుల భుజస్కంధాల మీద పడింది. రకరకాల నేరాలతో పాటు కొత్త టెక్నాలజీని అనూహ్యంగా వాడుకుని విజృంభించే అసాంఘిక శక్తులు విసిరే సవాళ్లకు ఎప్పటికప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. హోంగార్డులు, కానిస్టేబుళ్ల నుంచి ఎస్పీలు, డీజీపీ వరకు ప్రతి ఒక్కరూ మారుతున్న ఈ సమాజం విసురుతూ ఉన్న కొత్త సవాళ్లకు సమాధానం చెప్పడానికి సిద్ధం కావాలన్నారు. నేర నిరోధం, నేర దర్యాప్తు ఈ రెండింటిలోనూ మన పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీ ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారని, ఈ డివిజన్‌లో 130 మంది సాంకేతిక పోలీసింగ్ నిపుణులు మన కోసం పని చేస్తున్న వాస్తవం ప్రజలకు ఎంతో ధైర్యాన్నిస్తుందన్నారు. ఇదే సమయంలో తమ స్వార్థం కోసం ప్రజల జీవితాలతో ఆడుకుంటూ అశాంతి సృష్టించే ఇలాంటి దుర్మార్గుల విషయంలో ఎలాంటి మొహమాటం లేకుండా వారి ఆట కట్టించాలన్నారు. ప్రజలకు మంచి చేసే విషయంలో ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల మీద దాడి చేసే ఇటువంటి దుష్టశక్తులకు మనం గుణపాఠం నేర్పకపోతే ఇక సమాజంలో ఎవరికి రక్షణ ఉంటుందన్నది కూడా మనమంతా ఆలోచన చేయాల్సిన విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 16 వేల మంది మహిళా పోలీసులను ఈ నాలుగేళ్ల కాలంలో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అలాగే దేశంలో ఎక్కడా జరగని విధంగా వీక్లీఆఫ్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చే అడుగు మన ప్రభుత్వంలోనే పడింది. హోంగార్డులకు గతంలో రూ.12 వేలు ఇస్తే, మన ప్రభుత్వం రూ.21,300 ఇస్తోందన్నారు. కానిస్టేబుళ్ల నియామకాలలో హోంగార్డులకు గతంలో ఉన్న రిజర్వేషన్లు 8 శాతం ఉంటే వాటిని మనం 15 శాతానికి పెంచాం. ఏపీఎస్పీలో గతంలో 10 శాతం రిజర్వేషన్లు ఉంటే... ఈ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాం. ప్రతి పోలీసు సోదరుడికి బీమా కింద రూ.30 లక్షల నుంచి రూ.75 లక్షలు బీమా కవరేజ్ ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకు వచ్చింది. ఇది మాత్రమే కాకుండా పోలీసులకు చేయగలిగిన ప్రతి మేలూ కచ్చితంగా చేస్తామన్నారు. సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అన్నది మన విధానం. శాంతి భద్రతలకు అత్యధిక ప్రాధాన్యత. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని, ముఖ్యంగా ఆడపిల్లలు, మహిళలు విషయంలో, అణగారిన సామాజికవర్గాల భద్రత విషయంలో ఎలాంటి రాజీపడవద్దని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ మంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి, విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా పాల్గొన్నారు.

'గగన్‌యాన్' సాకారానికి ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

రాకెట్ నుంచి విడిపోయిన క్రూ మాడ్యూల్ పారాచూట్లతో సముద్రంలో పడింది. రాకెట్ నింగిలోకి వెళ్లాక శాస్త్రవేత్తలు 'అబార్ట్' సంకేతాన్ని పంపడంతో రాకెట్ పైభాగంలోని క్రూ ఎస్కేప్ వ్యవస్థకు సంబంధించిన ఘన ఇంధన మోటార్లు ప్రజ్వరిల్లాయి. 12 కిలోమీటర్ల ఎత్తులో క్రూ ఎస్కేప్ వ్యవస్థను రాకెట్ నుంచి వేరుచేశాయి. 17 కిలోమీటర్ల ఎత్తులో క్రూ ఎస్కేప్ మాడ్యూల్, క్రూ మాడ్యూల్ విడిపోయాయి. అనంతరం డ్రోగ్ పారాచూట్లు తెరుచుకోగా సెకనుకు 8.5మీటర్ల వేగంతో క్రూ మాడ్యూల్ బంగాళాఖాతంలో సురక్షితంగా దిగింది. వాస్తవానికి ఉదయం 8.45గంటలకు ఈ ప్రయోగం జరిగింది. కానీ చివరి నిమిషంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని నిలిపివేశారు. లోపాన్ని సరిచేసి 10 గంటలకు మరోసారి ప్రయోగించగా అది విజయవంతమైంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది గగన్‌యాన్‌ను ప్రయోగిస్తామని ఇస్రో చెబుతోంది. టీవీ-డీ1 ప్రయోగ విజయంతో ఇస్రో శాస్త్రవేత్తలకు సుళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, శ్రీసిటీ అధినేత రవి సన్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నాటక మండలి డైరెక్టర్, వైసీపీ పట్టణ అధ్యక్షులు కలతూరు శేఖర్ రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, వైసీపీ నేతలు కళ్లత్తూరు రామ్మోహన్ రెడ్డి, వేనాటి సతీశ్‌రెడ్డి, చిట్టేటి పెరుమాలు అభినందనలు తెలిపారు.

అందరి కృషితోనే: సోమనాథ్

టీవీ-డీ1 పరీక్షను విజయవంతంగా నిర్వహించడంతో శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అభినందించారు. అందరి కృషితోనే టీవీ-డీ1 మిషన్ విజయవంతమైందన్నారు. వ్యోమగాముల భద్రతా వ్యవస్థ సమర్థతను విశ్లేషించగలిగామని చెప్పారు. చివరి నిమిషంలో సాంకేతిక లోపం గుర్తించి, సరిచేసినట్లు తెలిపారు. మరలా ప్రయోగించగా అది విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. క్రూ మాడ్యూల్ సురక్షితంగా బంగాళాఖాతంలో దిగిందని సోమనాథ్ వెల్లడించారు. క్రూ ఎస్కేప్ వ్యవస్థ సమర్థత, క్రూ మాడ్యూల్ పనితీరు, వ్యోమనౌకను క్షేమంగా కిందకి తెచ్చే డిసలరేషన్ వ్యవస్థ పటిష్ఠతను ఈ పరీక్షలో పరిశీలించినట్లు ఇస్రో కూడా పేర్కొంది.

లక్ష్యానికి మరింత చేరువకు: మోదీ

గగన్‌యాన్ టీవీ-డీ1 పరీక్ష విజయంతో నిర్దేశిత లక్ష్యానికి మరింత చేరువయ్యామని ప్రధాని మోదీ అన్నారు. భారత తొలి మానవసహిత వ్యోగనౌక ప్రయోగం విజయం అనుకున్న సమయానికి జరుగుతుందని ఆకాంక్షించారు. టీవీ-డీ1 ప్రయోగ విజయానికిగాను ఇస్రో శాస్త్రవేత్తలను ఎక్స్ మాధ్యమంగా అభినందించారు.

చిత్తశుద్ధి ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

రైతులు వేయికళ్లతో ఎదురు చూశారు. కానీ సీఎం మాత్రం ఆ ఊసే ఎత్తలేదు... హామీ ఇవ్వలేదు. దీంతో ఏమి చేస్తామంటూ ఉసూరుమంటూ జనం సీఎం ప్రసంగం వింటూనే వెనుతిరిగారు. ఈ జిల్లాలోని ప్రజల సమస్యలు, కరువు పరిస్థితి, వలసల గురించి సీఎంకు ఒకవేళ తెలియదనుకున్నా, జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఏమి చేస్తున్నారనేది ప్రశ్న? వారికి ఈ జిల్లా ప్రజల ఇబ్బందులు అర్థం కావా, కనీసం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రికి ఈ జిల్లాలో ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నెలకొన్న కరువు ఛాయలు, ప్రారంభమైన వలసల పరిస్థితిని ముఖ్యమంత్రికి చెప్పారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకొని, రాబోయే ఎన్నికల్లో తమ సీటు పదిలం చేసుకోవాలని, ఆయన దృష్టిలో పడాలనే తపన తప్ప ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టకపోవడం దారుణం. నేడు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అక్టోబరులోనే వలసలు ప్రారంభం కావడమే కాకుండా తాగునీటి ఇబ్బందులు కూడా అధికమయ్యాయి. వర్షాకాలంలోనే ఇలా ఉంటే మరి శీతాకాలం, వేసవి కాలం వచ్చేసరికి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో నాలుగు నెలలుగా వారంలో రెండు రోజులు మాత్రమే మున్సిపాలిటీ కుళాయి నీరు విడుదల చేస్తున్నారు. నీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో వలసలు ప్రారంభమయ్యాయి. రైతులు ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం 77 చెరువులకు నీరు వదిలినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్ని చెరువులకు పైప్‌లైన్ వేశారో ఒకసారి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు నిజం చెప్పాల్సిన అవసరం ఉంది. చెరువులకు పైప్‌లైన్ వేసి కనెక్షన్ కూడా ఇవ్వకుండా 77 చెరువులకు నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. దీనిపై సీపీఐ, రైతు సంఘం నాయకులు ప్రశ్నించినా పట్టనట్లు వ్యవహరించారు.

మంత్రులు, ప్రజాప్రతినిధులు ఏమి చేస్తున్నారు?

జిల్లాలో నెలకొన్న కరువు, వలస పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో ప్రజాప్రతినిధులు, మంత్రులు విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, గిడ్డయ్య, రంగనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రికి స్థానిక సమస్యలు వివరించకుండా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఏమి చేస్తున్నారని వారు నిలదీశారు. ముఖ్యమంత్రి తన ప్రసంగమంతా తన ఎస్సీలు, తన ఎస్టీలు, తన మైనారిటీలు, తన బీసీ అని చెప్పారే కానీ రైతులను మాత్రం మరిచిపోయారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల, రైతుల ఓట్లు కావాలే కానీ వారి సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. సీఎం వెంటనే జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి కరువు జిల్లాగా ప్రకటించాలి, రైతుల రుణాలు మాఫీ చేయాలి, కరువు నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని, వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రైతులను భారీ ఎత్తున సమీకరించి జిల్లాలో మంత్రులను, ప్రజాప్రతినిధులను తిరగనివ్వమని, ఎక్కడికక్కడ అడ్డుకుంటామని సీపీఐ, రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. కరువు జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఉధృతంగా కొనసాగిస్తామని, ప్రభుత్వం మెడలు వంచి అయినా సాధిస్తామని స్పష్టం చేశారు.

మితిమీరిన స్మృతి ఇరానీ అజ్ఞానం

(మొదటిపేజీ తరువాయి)

కప్పిపుచ్చుకునే విధంగా సర్కార్ వ్యవహరిస్తోంది. పౌష్టికాహార లోపం వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనప్పటికీ కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ అహంకారపూరితంగా ఆకలి సూచీని ఎద్దేవా చేశారు. భారత్‌లో 140 కోట్ల మంది ఉంటే కేవలం మూడు వేల మందిని సర్వే చేసి ప్రపంచ ఆకలి సూచీ విడుదల చేశారని వ్యాఖ్యానించారు. భారత వాస్తవ పరిస్థితిని కొన్ని ప్రాజెక్టులు ఉద్దేశపూర్వకంగానే వెల్లడించడం లేదని ఆరోపించారు. తెలంగాణ, హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో భారతీయ మహిళల భవిష్యత్ పాత్ర అనే అంశంపై ఎఫ్ఐసీసీఐ కార్యక్రమంలో స్మృతి మాట్లాడుతూ ప్రపంచ ఆకలి సూచీని ఎద్దేవా చేశారు. 'ప్రపంచ ఆకలి సూచీని ఎలా రూపొందించారు. కేవలం 3వేల మందిని సర్వే చేయడం ద్వారానేగా... మరి దేశంలో 140 కోట్ల మంది ఉంటే మూడు వేల మందికి ఫోన్ చేసి మీకు ఆకలేస్తుందా అని ప్రశ్నించారా?' అంటూ స్మృతి విమర్శించారు. 'నేను ఉదయం 4 గంటలకు దిల్లీ నుంచి బయల్దేరి. 5 గంటల విమానంలో కొచ్చికి బయల్దేరా. అక్కడ ఓ సదస్సులో పాల్గొన్నా. మళ్లీ విమానం ఎక్కి ఇక్కడ (హైదరాబాద్)కు చేరుకున్నాను. నేను ఆహారం తీసుకునే సమయానికి 10 గంటలు అవుతుంది. ఈరోజు నాకు ఫోన్ చేసి ఆకలితో ఉన్నారా అని ఎవరైన అడిగే కచ్చితంగా అవుననే చెబుతాను' అని కేంద్రమంత్రి వ్యాఖ్యనించారు. కాగా ప్రపంచ ఆకలి సూచీ-2023లో భారత్ 111వ ర్యాంకుకు పడిపోయింది. భారత్ కంటే పాకిస్తాన్ (102) మెరుగైన స్థానంలో ఉంది. అయితే స్మృతి ఇరానీ తాజా వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఆమె మాటలు ఆమెలోని అజ్ఞానానికి అద్దంపట్టాయని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నాయి. ఆకలిని హేళన చేయడం సరైన పద్ధతి కాదని ఆమెకు హితవు పలికాయి. ' కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మీరు ఇలా మాట్లాడటం సిగ్గు చేట'ని స్మృతి ఇరానీని ఉద్దేశించి 'ఎక్స్' మాధ్యమంగా కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనటే వ్యాఖ్యానించారు. 'మీ మాటల్లో మీ అజ్ఞానం కనిపిస్తోంది. కొంతమందిని పిలిచి, మీకు ఆకలిగా ఉందా అని అడిగి, ఆకలి సూచీని తయారు చేస్తారని నిజంగా అనుకుంటున్నారా? మీరు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి. మీరు ఇలా మాట్లాడటం సిగ్గుచేటు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల, పౌష్టికాహార లోపం వంటి నాలుగు సూచీల ఆధారంగా ప్రపంచ ఆకలి సూచీని రూపొందిస్తారు. మీరు ఇది తెలుసుకోవాలి' అని శ్రీనటే ట్వీట్ చేశారు. ఆకలిని అపహాస్యం చేయొద్దని హితవు పలికారు. 'ఎక్కడికి వెళ్లినా తగినంత ఆహారం దొరుకుతుంది కాబట్టి మీకు ఆకలి అంటే ఏమిటో తెలియదు. మీరు ఎక్కే విమానాల్లోనూ ఆహారం లభిస్తుంది' అని శ్రీనటే దుయ్యబట్టారు. 'తినడానికి సమయం ఉండదు... తినడానికి ఆహారమే ఉండదు' అన్నవి వేరు. అహంకారానికి రూపం ఉంటే అది మంత్రిగారే' అని శివసేన (యూబీటీ) నేత ప్రియాంకా చతుర్వేది వ్యాఖ్యానించారు.

ఎస్టీయూ ఆక్రందన దీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్ నెలాఖరులోగా చెల్లిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆగ్రహించారు. నాలుగేళ్లుగా డీఎస్సీ ద్వారా ఒక్క ఉపాధ్యాయ పోస్టు మంజూరు చేయలేదన్నారు. ఉన్న ఉపాధ్యాయ పోస్టులను జీవో - 117 పేరుతో రద్దు చేస్తూ,3, 4, 5 తరగతులను విలీనం చేసి, ఈ విద్యా సంవత్సరంలో అకాడమీ కరికులం ప్రయోగాలతో కొంతకాలం బై జ్యూస్, మరికొంత కాలం సీబీఎస్ఈ, ఇటీవల టోఫెల్, ఐబీ తదితర ప్రయోగాలతో పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని విమర్శించారు. దీని ఫలితంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే మూడు లక్షల 80 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలివేసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లారని తెలిపారు. 2019లో సీఎం జగన్ ఇచ్చిన ఎన్నికల హామీల్లో, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం చేర్చి, తీరా అధికారంలోకి వచ్చాక జీపీఎస్ పేరుతో ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసగించడం సమంజసమా ? అని ప్రశ్నించారు. ఈ దేశంలో రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ , చత్తీస్ ఘడ్, పంజాబ్, కర్నాటక తదితర రాష్ట్రాలలో పాత పెన్షన్ అమలు చేశారని వివరించారు. మన రాష్ట్రంలోనూ అమలు చేస్తే వచ్చే నష్టమేమిటో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఉపాధ్యాయుల ఆక్రందన దీక్షలతోనైనా ఈ ప్రభుత్వం దిగివచ్చి, వారి ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే సాధారణ ఎన్నికల్లో ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దీక్షలు విజయవంతం అయ్యాయని, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులందరూ పాల్గొని ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను తెలియజేశారన్నారు. ఆయా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించిన దీక్షలకు ఎస్టీయూ స్థానిక నేతలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విశాలాంధ్ర
ఆదివారం
22 అక్టోబరు 2023

నెమలికంటికి 'ఏఆర్ కృష్ణ' పురస్కారం

విశాలాంధ్ర-తెనాలి: ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు నెమలికంటి రామారావును ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్, తెనాలి, కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం కళలకాణాచి-తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ విజయవాడ సంయుక్త అధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వీణా అవార్డ్స్-2023లో భాగంగా ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన నెమలికంటి రామారావుకు అందజేశారు. కళల కాణాచి సంస్థ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏఆర్ కృష్ణ కుమారులు, ఏపీ నీలం, డా.పాటిబండ్ల దక్షిణామూర్తి, ఐనాల నాగమల్లేశ్వరరావు, బుర్రా జయలక్ష్మి, జీఎస్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీవినాయక నాటక కళామండలి-రెణిగుంట వారి 'మహారథి కర్ణ' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. శ్రీవెంకటగిరి వీరమల్లయ్య భాగవతులు రచన చేయగా జానకిరావు దర్శకత్వం వహించారు. కళాధామం పాలకొల్లు వారు పీఎస్ఆర్ ఆంజనేయులు రచన 'కారే రాజులు-రాజ్యముల్ కలుగవే' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. భాస్కరరాజు కళాపీఠం తేటగుంట వారి సాంఘిక నాటకం 'క్షీరసాగర మధనం' ప్రదర్శించారు. ఎంవీఎస్ హరినాధరావు రచన, విజయబాబు దర్శకత్వం వహించారు. అనంతరం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు శ్రీనివాసరావు పోలుదాసు రచన, దర్శకత్వం వహించిన 'రాత' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ రచయిత డా.బుజ్జా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు కార్యక్రమాలను నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో
6 కోట్లకు పైగా వైద్య పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా శనివారం నాటికి ఆరు కోట్ల మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9105 శిబిరాలు ఏర్పాటు చేశారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఏడు కీలక వైద్య పరీక్షలు చేసి అనారోగ్య సమస్యలు ఉంటే వైద్య సహాయానికి సూచనలు ఇస్తున్నారు. సెప్టెంబర్ 30 వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల వారీగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాల ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఇంటి వద్దే 6.14 కోట్ల మందికి పైగా ప్రజలకు రాపిడ్ పరీక్షలు నిర్వహించారు.

టీడీపీ-జనసేన కూటమికి 160 స్థానాలు ఖాయం

టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి 160 స్థానాలు గెలవటం ఖాయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. చేయని తప్పుకు చంద్రబాబు నాయుడిని అక్రమ కేసులతో జైలుకు పంపి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని అన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటికీ ప్రచారం, ఓటర్ వెరిఫికేషన్, నిజం గెలవాలి యాత్ర, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్తలకు నేతలు నివాళి అర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి కుట్ర రాజకీయాలను వైసీపీ ఎంపీలు సైతం తప్పు పడుతున్నారన్నారు. నేను దిల్లీ వెళ్లినప్పుడు వారే స్వయంగా నన్ను కలిసి జగన్ చేసింది తప్పు అని, దానికి తగిన మూల్యం చెల్లించకతప్పదని అంటున్నారన్నారు. చంద్రబాబు నాయుడికి అన్ని రాష్ట్రాల నుంచి, వివిధ దేశాల నుంచి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని, ఆయన ఏ తప్పు చేయలేదని అన్నారు. గతంలో పింక్ డైమండ్ రూ.6 లక్షల కోట్ల అవినీతి అంటూ తప్పుడు ఆరోపణలు చేశారు నిరూపించారా? అని ప్రశ్నించారు. ఒక్క ఛాన్స్ ఇస్తే మీ జీవితాలు మార్చేస్తా అంటే ప్రజలు 151 సీట్లు ఇచ్చారు. 151 కూడా ఆయనకి సరిపోలేదు. టీడీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలను చేర్చుకున్నాడు. ఆయన కేంద్రం మెడలు వంచుతాడు.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడు... ప్రజల జీవితాలు మారిపోతాయని అందరూ అనుకున్నారన్నారు. ఒక్క రోడ్డు వెయ్యరు... ఒక్క సాగునీటి ప్రాజెక్టు కట్టరు... ఒక్క కంపెనీ తీసుకురారు... కృష్ణా జలాలపై మన రాష్ట్రం హక్కు కోల్పోతుంటే పట్టించుకోరు... రైతాంగానికి సాగు నీరు ఇవ్వలేరు... కానీ సీఎం అయిన మొదటి రోజు నుంచే వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ సైకో జగన్ కక్ష సాధింపు మాత్రమే అజెండాగా పెట్టుకొని పని చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపాడు. నాపై కూడా తప్పుడు కేసులు బనాయించాడు. మనం తగ్గేదే లేదు... చంద్రబాబు ఇచ్చిన కార్యాచరణ ముందుకు తీసుకెళ్లడం మన బాధ్యత అని అన్నారు. ప్రజలందరికి నాయకుడికి, నియంతకి మధ్య తేడా తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. 2014లో చంద్రబాబుకు అధికారం ఇస్తే ఆయన నాయకుడిలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. 2019లో జగన్‌కి అధికారం ఇస్తే నియంతలా రాష్ట్రాన్ని నాశనం చేసాడు.. అప్పుల్లో ముంచేసాడు.. రాష్ట్రానికి కియా, డిక్సన్, ఫాక్స్‌కాన్ లాంటి ఎన్నో పెద్ద కంపెనీలు తెచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించినందుకు, పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేసినందుకు చంద్రబాబుని బంధించారని అన్నారు. రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలు చేసినందుకు, సంక్షేమ పథకాలు అందించినందుకు, ఇతర రాష్ట్రాలకు దీటుగా మనకు రాజధాని ఉండాలని కష్టపడినందుకు చంద్రబాబుని అక్రమ అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం ఎందుకు అని ప్రశ్నించడం తప్పా? ఇసుక దోపిడీ, కల్తీ మద్యం గురించి మాట్లాడటం నేరమా? కేంద్రం మెడలు వంచి సాధిస్తా అన్న ప్రత్యేక హోదా ఎక్కడ అని నిలదీయడం జగన్ తట్టుకోలేకపోయాడా? షాక్ కొడుతున్న కరెంట్ బిల్లు, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేయడం చంద్రబాబు చేసిన తప్పా? ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడాన్ని కూడా జగన్ తట్టుకోలేకపోయాడని అన్నారు. మన నాయకుడు తప్పు చేయలేదు... తప్పకుండా బయటకు వస్తారు... ఈ లోపు మనం ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు 5 నెలలే సమయం ఉందని, కొంతమంది నేతల పనితీరు ఇంకా మారాలన్నారు. మొహమాటానికి వెళ్లి పార్టీకి నష్టం చేయలేమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై కూడా దృష్టిసారించండి, ఫేక్ అకౌంట్లతో టీడీపీ-జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ పేటీఎం బ్యాచ్ గొడవలు సృష్టిస్తున్నారు. దీన్ని తిప్పికొట్టాలన్నారు. మనం నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. వైసీపీ వైఫల్యాలు, అరాచకాలు ప్రజల్లో ఎండగట్టి వారిని చైతన్యం చేయాలని అన్నారు. సమావేశంలో అనేక మంది నేతలు అడిగిన సందేహాలను లోకేశ్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, పార్లమెంటు అధ్యక్షులు, అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇస్రో బృందానికి జగన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానవసహిత గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా శనివారం టెస్ట్ వెహికల్ ఫ్లైట్ (టీవీ-డీ1) పరీక్ష విజయవంతం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు తెలిపారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో ఇస్రో దూసుకెళుతోందని కొనియాడారు. 'టెస్ట్ వెహికిల్ అబార్ట్ మిషన్'(టీవీ-డీ1) ప్రయోగం శ్రీహరికోట నుంచి జరిగింది. రాకెట్ నింగిలోకి దూసుకెళ్లగా క్రూ మాడ్యూల్ పారాచూట్‌ల సాయంతో కిందకు సురక్షితంగా దిగింది. గగన్‌యాన్‌లో వ్యోమగాముల భద్రతకు సంబంధించి కీలకమైన ఈ సన్నాహక ప్రయోగం సాంకేతిక సవాళ్ల నడుమ విజయవంతమైంది.

జగన్ దసరా శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ సీఎం జగన్ మోహన్ రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ అనుగ్రహం కోసం నవరాత్రుల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తుల విజయానికి ప్రతీక విజయదశమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనక దుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా ?

లోకేశ్‌కు మంత్రి జోగి రమేశ్ సవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు మంచోడు అయితే ఆయన, కుటుంబ సభ్యుల ఆస్తులపై సీబీఐతో విచారణకు సిద్ధమేనా? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సవాల్ విసిరారు. అధికారంలో ఉంటే క్యాష్, ఆ తర్వాత క్లాష్, ఇదీ టీడీపీ తీరని మంత్రి ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ, పెత్తందారీవర్గాల ప్రతినిధి చంద్రబాబు అని, బాబు నాయకుడు కాదు, టీడీపీ వ్యాపార సంస్థకు సీఈవో అంటూ విమర్శించారు. గ్యారంటీ లేని వాళ్లు, ప్రజల భవిష్యత్తు గ్యారంటీ ఇస్తారా? అని నిలదీశారు. హైదరాబాద్ వాసులకు ఆంధ్రాలో పెత్తనమేంటి..? అని మండిపడ్డారు. వీరంతా సభలు పెట్టుకుని, పనిగట్టుకుని ప్రభుత్వంపై విషం కక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. స్కిల్ కుంభకోణంలో లోకేశ్ తండ్రి చంద్రబాబు రూ.371 కోట్ల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. చంద్రబాబు, కుటుంబ సభ్యుల ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమార్కుల గుండెల్లో రైళ్లను జగన్ పరిగెత్తిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు మాత్రమే జగన్‌ను వద్దనుకుంటున్నారని అన్నారు. ప్రజలంతా మళ్లీ సీఎం జగనే అంటున్నారని స్పష్టం చేశారు. పేద పిల్లలు గొప్పగా చదువుకోవాలని, విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తెచ్చి ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిన నేత సీఎం జగన్ అని కొనియాడారు. రాబోయే 20 ఏళ్లూ సీఎంగా జగనే ఉంటారని నొక్కి చెప్పారు. భవిష్యత్తే లేని వాళ్లు, భవిష్యత్తు పేరుతో కలలుగంటూ మేం అధికారంలోకి వస్తామంటున్నారని ఎద్దేవా చేశారు.

విశాఖ స్టీల్‌పై కేంద్రానిది సవితితల్లి ప్రేమ

- ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గే వరకు ఐక్యపోరు
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విశాఖ: వైజాగ్ స్టీల్‌పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఏఐటీయూసీ ఏపీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. ప్రైవేటీకరణపై వెనక్కి వెళ్లే వరకూ ఐక్యపోరాటం ఆగదని తేల్చిచెప్పారు. ఉక్కునగరం సీడబ్ల్యూసీ-1లో విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కౌన్సిల్ సమావేశం శనివారం కేఎస్ఎన్ రావు అధ్యక్షతన జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమం వెయ్యి రోజులకు చేరుతోందని, గొప్ప పోరాటంలా పేరు తెచ్చుకుందన్నారు. దీనిని ఇంకా తీవ్రతరం చేయాలని, కేంద్రం మెడలు వంచి ప్రైవేటీకరణపై వెనక్కి వెళ్లేలా చేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ జరగదని పార్లమెంటులో ప్రకటించేంత వరకూ పోరాడాల్సిందేనన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ఉత్పత్తిని దెబ్బతీసి సంస్థ సహజ మరణం పొందేలా యాజమాన్యం చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు. బీఎఫ్ 3ని జిందాల్ వంటి ప్రైవేటు సంస్థ చేజిక్కనివ్వమని స్పష్టంచేశారు. వైజాగ్ స్టీల్ యాజమాన్యమే దానిని పునఃప్రారంభించి, ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపించాలని డిమాండ్ చేశారు. సెయిల్ మాదిరి విశాఖ స్టీల్‌లో 2017 వేతన సవరణను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, డి.నర్సింగరావు, నరేశ్ కుమార్, మిశ్రా, రాజబాబు, జి.జయ, ఎస్.శ్రీనివాసరావు, ఎం.రవి, డిపార్ట్‌మెంట్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత పథకాలకు నిధుల విడుదలపై శ్వేతపత్రం

కరవది సుబ్బారావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: దళిత పథకాలకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డీహెచ్‌పీఎస్ ఏపీ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 27కుపైగా దళిత పథకాలు నిర్వీర్య దిశకు చేరుకున్నాయని శనివారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. ఒక పథకానికి నిధుల కేటాయింపు, లబ్ధిదారుడికి నిధులు కేటాయింపు వంటివి జరగలేదని పేర్కొన్నారు. నవరత్నాల పేరుతో దళితులకు చెందాల్సిన నిధులను పప్పు-బెల్లాలుగా అందరికీ ప్రభుత్వం పంచుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం దళిత గిరిజనులకు చెందిన నిధులు ఏమయ్యాయి? దళిత, గిరిజన, మహిళలపై దాడులు, హత్యలు, పెరిగిపోతుంటే ఎందుకు స్పందించరు? అని ప్రభుత్వాన్ని సుబ్బారావు ప్రశ్నించారు. దళిత వాడలోని పాఠశాలలను ఎత్తివేసి గ్రామీణ పాఠశాలల్లో కలపడం ద్వారా దళితవాడ విద్యార్థుల డ్రాప్ అవుట్‌లు పెరుగుతున్నట్లు తెలిపారు. నూతన మద్యం విధానం పేదల పాలిట శాపంగా మారిందన్నారు. మద్యం బాధిత కుటుంబాలు పెరుగుతున్నాయన్నారు. మద్యం వల్ల చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. ఇప్పటికైనా స్పందించి దళితులకు న్యాయంగా రావాల్సిన నిధులు దక్కేలా చూడాలని కోరారు. పథకాలకు నిధులు కేటాయించి అవి సక్రమంగా దళితులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ పట్టాల, స్టాంపు కుంభకోణం బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుబ్బారావు డిమాండ్ చేశారు.

ఏపీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ల నియామకం

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్‌కు డైరెక్టర్లను నియామిస్తూ ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదరి ఎండీ.ఇంతియాజ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ముతావల్లి కోటాలో ఖాజా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోటాలో హాఫీజ్‌ఖాన్, రుహుల్లా ఎన్నికయ్యారు. వివిధ విభాగాల్లో మరో ఎనిమిది మందిని ఎంపిక చేశారు.

సామాజిక కార్యకర్త కోటాలో ఖాదర్ బాషా, షియా స్కాలర్ కోటాలో మీర్ హుస్సేన్, సున్నీ కోటాలో షఫీ అహ్మద్ ఖాదరీ, ప్రభుత్వ అధికారి కోటాలో షిరీన్ బేగం (ఐపీఎస్), ఎంపీ కోటాలో బర్కత్ ఆలీ, నసీర్ బాషా, న్యాయవాది కోటాలో పఠాన్ షఫీ అహ్మద్, హసీనా బేగం ఎంపికయ్యారు. వక్ఫ్‌బోర్డ్‌కు మొత్తం 11 మంది డైరెక్టర్లను నియమిస్తూ మైనారిటీ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

కడప ఉక్కు పరిశ్రమ సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణకు

28న రౌండ్‌టేబుల్, 8న విద్యాసంస్థల బంద్

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు స్పష్టం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం నవంబరు 8న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. కడపలో ఉక్కు పరిశ్రమ సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక ,మేధావులతో కర్నూల్‌లో ఈనెల 28న రౌండ్ టేబుల్ నిర్వహిస్తామని తెలిపారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం విభజన హామీల అమలు అవశ్యమని నొక్కిచెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. దీనిపై రాష్ట్రంలోని బీజేపీ నేతలు ఎందుకని కేంద్రాన్ని నిలదీయడం లేదని లెనిన్‌బాబు ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు శనివారం సీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర, పీడీఎస్‌యూ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి నాగరాజుతో కలిసి లెనిన్‌బాబు మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నవంబరు 8వ తేదీ నాటికి కార్మికుల దీక్షలు వెయ్యి రోజులకు చేరుతాయన్నారు. దీనిని పురస్కరించుకొని వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు ఆందోళనలతో పాటు విద్యాసంస్థల బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపయోగపడే విశాఖ ఉక్కు కర్మాగారం... పార్లమెంటు నిర్మాణానికి సైతం ఉక్కును అందించిందని గుర్తుచేశారు. దీనిని ప్రైవేటుకు అప్పగించడం దుర్మార్గమని, దానికి అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, సాబీర్ బాషా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శరత్, బిసన్న, మునిస్వామి, రంగస్వామి పాల్గొన్నారు.

గోవా జాతీయ క్రీడలకు
రాష్ట్ర జట్లను తీసుకువెళ్లేది ఏపీ ఒలింపిక్ సంఘమే

- ఆర్‌కే పురుషోత్తం నేతృత్వంలోని సంఘానికే ఐఓఏ గుర్తింపు
- ఏపీఓఏకు, క్రీడాకారులకు అన్ని రకాల ప్రయోజనాలు చేకూర్చాలని శాప్‌కు హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర -విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీఓఏ) విషయంలో రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘమే అసలు సిసలైన రాష్ట్ర ఒలింపిక్ సంఘమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) గుర్తింపు కూడా ఉన్న ఈ సంఘాన్నే అధికారికంగా గుర్తించడంతో పాటు గోవాలో జరగనున్న జాతీయ క్రీడలలో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జట్లను తీసుకువెళ్లే అధికారం ఉందని పేర్కొంది. రాష్ట్ర క్రీడాకారులతో పాటు ఒలింపిక్ సంఘానికి ఆర్థిక సహకారంతో పాటు అన్ని రకాల ప్రయోజనాలు సమకూర్చాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఈ నెల 19న తుది ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఆ ఉత్తర్వుల ప్రతులను ఈ నెల 20న హైకోర్టు రిజిస్ట్రీ విడుదల చేసింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో రెండు వర్గాలు తమదే అసలైన ఏపీఓఏ అంటే తమదే అసలైన సంఘమంటూ క్రీడా సంఘాలు, క్రీడాకారులను అయోమయానికి గురి చేస్తూ వచ్చాయి. చివరకు గోవాలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 37వ జాతీయ క్రీడలలో పాల్గొనేందుకు రాష్ట్ర జట్లను తీసుకువెళ్లే విషయంలోనూ అయోమయం నెలకొంది. దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షుడుగా వ్యవహరించే ఆంధ్ర ప్రదేశ్ ఒలింపిక్ సంఘానికి ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) గుర్తింపు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ (శాప్) ఆ సంఘాన్ని గుర్తించ లేదు. ఇది గోవా జాతీయ క్రీడలకు జట్లను తీసుకువెళ్లటంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈ తరుణంలో రెండు క్రీడా సంఘాలు హైకోర్టును ఆశ్రయించగా, గోవా జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను తీసుకువెళ్లే బాధ్యతను శాప్‌కు అప్పగిస్తూ సింగిల్ బెంచ్ ధర్మాసనం ఈ నెల 12న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ ఏపీఓఏ అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం 1015/2023 పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఈ నెల 19న తుది తీర్పును వెలువరించింది. అంతేకాకుండా సింగిల్ బెంచ్ ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించిన ధర్మాసనం, ఐఓఏ అధ్వర్యంలో నిర్వహించే జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను తీసుకువెళ్లే బాధ్యత ఏపీ ఒలింపిక్ సంఘానిదేనని స్పష్టత ఇచ్చింది. అలాగే రాష్ట్ర జట్లను తీసుకువెళ్లే ఒలింపిక్ సంఘానికి శాప్ పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని ఆదేశించింది. 2019 సెప్టెంబరు 19న జారీ చేసిన జిఓఎంఎస్ నంబరు 272 ప్రకారం గోవా జాతీయ క్రీడలకు వెళ్లే క్రీడాకారుల ప్రయోజనాలను నిలుపుదల చేయవద్దని, ఆర్‌కె పురుషోత్తం నేతృత్వంలోని ఒలింపిక్ సంఘం తీసుకువెళ్లే క్రీడాకారులకు అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

రాష్ట్రంలో ఒక్కటే ఒలింపిక్ సంఘం

రాష్ట్రంలో ఒక్కటే ఒలింపిక్ సంఘం ఉందని, అది ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షుడుగా ఉన్న సంఘమేనని, దానికి ఇండియన్ ఒలింపిక్ సంఘం గుర్తింపు ఉందని, రెండో సంఘం లేదంటూ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేగాకుండా ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షుడుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘాన్ని అధికారికంగా గుర్తింపు ఉన్న రాష్ట్ర ఒలింపిక్ సంఘంగా గుర్తించాలని, ఆ సంఘం అధ్వర్యంలోనే గోవా జాతీయ క్రీడలలో ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది. ఇదిలావుండగా, కెపి రావు ప్రధాన కార్యదర్శిగా ఉన్న పోటీ ఒలింపిక్ సంఘం విషయంలోనూ హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఉత్తర్వులు వెలువరించింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఆర్బిటల్ కమిషన్ 2017 డిసెంబరు 24న ఇచ్చిన గుర్తింపును ఐఓఏ ఆర్బిటల్ ట్రిబ్యునల్ కొనసాగిస్తూ 2022, మార్చి 15న కొనసాగించిందని ధర్మాసనం పేర్కొంది. దీంతో తమకు గుర్తింపు ఇవ్వాలంటూ కెపి రావు అభ్యర్థనను ఐఓఏ ఆర్బిటల్ ట్రిబ్యునల్ తిరస్కరించిందని ధర్మాసనం తన ఉత్తర్వులలో పేర్కొంది. అలాగే, గోవా జాతీయ క్రీడలకు చీఫ్ డి మిషన్, డిప్యూటీ చీఫ్ డి మిషన్‌తో పాటు సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించే అధికారాన్ని కూడా ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షుడుగా ఉన్న ఒలింపిక్ సంఘానికి అప్పగించిందనే విషయాన్ని ధర్మాసనం తన ఉత్తర్వులలో పేర్కొంది.

శాప్ వైఖరిపై ధర్మాసనం ఆగ్రహం

ఐఓఏ గుర్తింపు ఉన్న రాష్ట్ర ఒలింపిక్ సంఘాన్ని గుర్తించడంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికారసంస్థ (శాప్) వైఖరిపైనా హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఓఏ గుర్తింపు ఉన్న సంఘాన్ని గుర్తించక పోగా, జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను తమే తీసుకు వెళతామంటూ శాప్ ప్రకటించటాన్ని తప్పుపట్టింది. ఈ విషయంలో శాప్ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. అంతేగాకుండా జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను తీసుకు వెళ్లే బాధ్యత సంబంధిత రాష్ట్ర ఒలింపిక్ సంఘాలదేనని, ఈ విషయంలో నిబంధనలను అతిక్రమించొద్దని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒలింపిక్ సంఘానికి శాప్ సహకారం అందించాలన్నారు. అదే సమయంలో క్రీడాకారుల టీఏ, డీఏ, స్పోర్ట్స్ కిట్‌లు, ఇతర ప్రయోజనాలపై ప్రశ్నించగా, ఆ మొత్తాలను క్రీడాకారుల బ్యాంక్ ఖాతాలో వేస్తామన్న శాప్ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. జాతీయ క్రీడలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహకారాన్ని ఒలింపిక్ సంఘానికి అందజేయా లని సూచించింది. అదే సమయంలో శాప్ సహకారం అందించకపోతే, క్రీడాకారులను ఏవిధంగా గోవా తీసుకువెళతారని ఆర్‌కె పురుషోత్తం నేతృత్వంలోని ఒలింపిక్ సంఘాన్ని ప్రశ్నించగా, అన్ని ఖర్చులు తామే భరిస్తామని ఏపీఓఏ స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర జట్లకు అన్ని రకాల ప్రయోజనాలను చేకూర్చాలని శాప్‌ను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

సంపాదకీయం

ఆయుధ బేహారి బైడెన్

అక్టోబర్ ఏడవ తేదీన హామస్ ఇజ్రాయిల్ మీద వేలాది రాకెట్లతో దాడిచేసిన తరవాత ఇజ్రాయిల్ హమాస్ మీద, నిజానికి పలస్తీనియన్లమీద భారీస్థాయిలో యుద్ధం ప్రకటించింది. అంతర్జాతీయసమాజం రెండుశిబిరాలుగా చీలిపోయింది. ఇజ్రాయిల్‌ను సమర్థించే వారి శిబిరం విస్తృతి ఎక్కువగాఉంది. హమాస్ చేసిన పనిని సమర్థించవలసిన అగత్యంలేదు. కానీ దశాబ్దాలుగా పలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ రోజువారీగా చేస్తున్న దాడులను సరైన దృక్కోణంతో చూసేవారు చాలా స్వల్పం. యుద్ధం ప్రారంభం కాగానే అమెరికా అధ్యక్షుడు బైడెన్ హఠాత్తుగా ఇజ్రాయిల్‌లో వాలిపోయారు. యుద్ధం నివారించడం బైడెన్ ఉద్దేశంకాదు అని తేలిపోయింది. యుద్ధం ప్రారంభించగానే బైడెన్ ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించారు. అంటే యుద్ధాన్ని ప్రోత్సహించారు. అంతకు ముందే గత మంగళవారం జర్మనీ చాన్సలర్ ఒలోఫ్ స్కోల్జ్, ఆ మరుసటి రోజు బైడెన్ కూడా ఇజ్రాయిల్‌ను సందర్శించారు. బ్రిటన్ ప్రధానమంత్రి సునక్ కూడా ఏ మాత్రం వెనుకబడలేదు. బుధవారం ఆయన ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూతో చర్చలు జరిపారు. వెరసి వీరిలో ఎవరూ యుద్ధ నివారణకోసం చేసింది శూన్యమే. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఏ దేశ పర్యటనకైనా వెళ్తే కొన్ని నెలలు, కనీసం కొన్ని వారాలముందు ఏర్పాట్లు ప్రారంభం అవుతాయి. పరిస్థితి అల్లకల్లోలంగా ఉన్నప్పుడు బైడెన్ హఠాత్తుగా ఇజ్రాయిల్ సందర్శించడం అపూర్వమైన ఘటనే. యుద్ధం మొదలు కాగానే బైడెన్ విమానవాహక నౌకలను ఇజ్రాయిల్‌కు పంపించి తాము ఎవరి పక్షాన నిలిచారో స్పష్టం చేశారు. బైడెన్ పర్యటన దీర్ఘకాలికంగా ఇజ్రాయిల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని రుజువుచేసి ఉండొచ్చు. అమెరికా, బ్రిటన్, జర్మనీ దేశాల అధినేతలు ఇజ్రాయిల్ సందర్శించిన తరవాత యుద్ధం తగ్గుమొహం పట్టిన దాఖలాలైతే లేవు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం బాగా పెరగడానికే ఈ పర్యటనలు ఉపకరించాయి. గాజా మీద ఇజ్రాయిల్ విచక్షణారహిత దాడులు చేస్తోంది. ఆసుపత్రులమీద కూడా బాంబులువేసి వందలు, వేలమంది ప్రజల ప్రాణాలను హరిస్తోంది. గాజాలో ఎక్కడ చూసినా భవనాల శిథిలాలు, శవాల గుట్టలు కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా ఇజ్రాయిల్ చేసిన దాడులన్నీ యుద్ధ విమానాల సాయంతోనే. అవసరమైతే పదాతిదళాలను కూడా గాజాలోకి నడిపించడానికి ఇజ్రాయిల్ సర్వసన్నద్ధంగా ఉంది. 24 గంటల సమయంలో గాజాలోని పది లక్షల మంది లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పోవాలని హెచ్చరించింది. గాజా భూభాగంలోకి ఇజ్రాయిల్ దళాలు ప్రవేశిస్తే ప్రాణనష్టం అనూహ్యంగా ఉంటుంది. పలస్తీనియన్ల మీద బాంబుల వర్షం కురిపిస్తున్నందుకు అమెరికాను సమర్థించే అరబ్ దేశాలు కూడా ఆగ్రహిస్తున్నాయి. ఇప్పటికే దాదాపు నాలుగువేల మంది పలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడుల్లో బలయ్యారు. రష్యాకు ఉక్రెయిన్‌కు దీర్ఘకాలికంగా కొనసాగుతున్న ఘర్షణల్లోనూ అమెరికా ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడంమీదే దృష్టి కేంద్రీకరించింది. పెద్దన్నపాత్ర పోషిస్తున్న అమెరికా కానీ, పశ్చిమ దేశాధినేతలు కానీ ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధాన్ని, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోగానీ, పలస్తీనియన్లపై ఇజ్రాయిల్ అమానుషమైనదాడిలో కానీ శాంతి నెలకొనేట్టు చేయాలన్న ప్రయత్నం మచ్చుకైనాలేదు. బైడెన్ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూకు చేసిన హితబోధల్లా ఇరాక్‌లోనూ, అఫ్గానిస్థాన్‌లోనూ తాము చేసిన పొరపాట్లు చేయకూడదని మాత్రమే. హమాస్‌కార్యకర్తలు కొందరిని బందీలు చేయడాన్ని తప్పు పడ్తున్న పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమాన్ని ఆపేయాలని మాత్రం చెప్పడంలేదు. ఇజ్రాయిల్ సందర్శించి బైడెన్ చేసిందల్లా నెతన్యాహూ యుద్ధోన్మాదానికి ఆజ్యం పోయడమే. సాధారణ పౌరుల ప్రాణాలకు నష్టం లేకుండా చూసుకోవాలని బైడెన్ ఇచ్చిన సలహాను నెతన్యాహూ పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. నెతన్యాహూ యుద్ధ పిపాసకు మద్దతు ఇవ్వడంతో పాటు పశ్చిమా సియాకు, ముఖ్యంగా ఇరాన్‌కు, లెబెనాన్‌లో ఉన్న హెజ్బుల్లాకు ఖబడ్దార్ అన్న హెచ్చరిక చేయడానికి బైడెన్ ఏ అవకాశాన్ని వదులుకోలేదు. 1948లో పలస్తీనా గడ్డ మీద కృత్రిమంగా ఏర్పాటు అయిన ఇజ్రాయిల్ విస్తరణవాదాన్ని, పలస్తీనియన్లను ఆ ప్రాంతం నుంచి తరిమేయడానికి జరుగుతున్న ప్రయత్నాలు పశ్చిమ దేశాధినేతలకు అభ్యంతరకరం కాకపోవడంలో ఆశ్చర్యపడవలసింది ఏమీలేదు. లెబెనాన్ నుంచి పనిచేస్తున్న హెజ్బుల్లాకు మద్దతుగా ఇరాన్ ఎక్కడ యుద్ధ రంగంలోకి దూకుతుందోనన్న భయం మాత్రం ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్న దేశాలను పీడిస్తోంది. గాజాలో ఆసుపత్రిమీద బాంబుల వర్షం కురిపించడం పశ్చిమాసియాలోని నాయకులను విచలితం చేసింది. బైడెన్ ఇజ్రాయిల్ గడ్డమీద కాలుమోపడానికి కొద్దిగంటల ముందే ఆసుపత్రిని ఇజ్రాయిల్ సర్వనాశనం చేసింది. ఇది యుద్ధ నేరం అని చెప్పడానికి పెద్ద పరిజ్ఞానం అవసరంలేదు. బైడెన్ జోర్డాన్ రాజు అబ్దుల్లాను, ఈజిప్టు నాయకుడు ఎల్-సిస్సీని, పలస్తీనా అధ్యక్షుడు మమ్మద్ అబ్బాస్‌ను కలుసుకోవాలనుకున్నారు. కానీ అరబ్ నేతలు బైడెన్‌తో సమావేశం కావడానికి నిరాకరించారు. ఇజ్రాయిల్‌కు, ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి 106 బిలియన్‌డాలర్లు కావాలని బైడెన్ ప్రభుత్వం అమెరికా పార్లమెంటును అర్థిస్తోంది. ఇందులో 74 బిలియన్‌డాలర్లు ఉక్రెయిన్‌కు, ఇజ్రాయిల్‌కు అందజేస్తారట. విచిత్రం ఏమిటంటే పలస్తీనియన్లకు కూడా బైడెన్ సహాయం అందజేస్తారట. గాజా ప్రజలకు మానవతావాద దృక్పథంతో ఇతర దేశాలు అందజేసే సహాయాన్ని అనుమతించాలని బైడెన్‌చేసిన విజ్ఞప్తిని నెతన్యాహూ లెక్కచేయలేదు. దక్షిణగాజాలోని వారికి సహాయం అందించడానికి మార్గంసుగమంచేయాలని ఈజిప్టు అధ్యక్షుడికి విజ్ఞప్తిచేసినా ఇంతవరకు ఫలితం అయితే కనిపించలేదు. నెతన్యాహూ ఎంత యుద్ధోన్మాదం ప్రదర్శిస్తున్నా ఇజ్రాయిల్ ప్రజలు మాత్రం యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు కొనసాగిస్తూనే ఉన్నారు. అమెరికాలోని వివిధ నగరాల్లో ఈ ప్రదర్శనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈప్రదర్శనలు కొనసాగుతున్నాయి. యుద్ధం కావాల్సింది పాలకులకు, ఆ పాలకులకు మద్దతిచ్చే అమెరికా లాంటి దేశాలకు మాత్రమే. యుద్ధంచేసేవారికి ఆయుధాలు, గాయపడినవారికి మందులు సరఫరాచేసి రెండు విధాలా వ్యాపారం పెంపొందించుకోవడం అమెరికా పాలకులు ముందు నుంచి అనుసరిస్తున్న విధానమే. అమెరికాప్రజల్లో 55 శాతం మంది బైడెన్ అనుసరిస్తున్న విధానాన్ని ఈసడిస్తున్నారు. అమెరికాలో ప్రధానమైన డెమొక్రాటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ వైఖరి ఏమైనప్పటికీ ప్రజలు మాత్రం యుద్ధం కోరుకోవడంలేదని తాజాసర్వేలో తేలింది. 53 శాతం మంది డెమోక్రాటిక్‌పార్టీ సమర్థకులు ఇజ్రాయిల్‌కు అమెరికా అదనంగా ఆయుధ సహాయం చేయకూడనే భావిస్తున్నారని తాజా సర్వేలో తేలింది. జనాభిప్రాయం యుద్ధానికి వ్యతిరేకంగా ఉండడం సహజమే. ఇజ్రాయిల్ కు, ఉక్రెయిన్‌కు సహాయంపేరిట ఆయుధాలు అమ్ముకునే అమెరికా విధానాలను ప్రజలు ఎప్పుడూ సమర్థించరు. కానీ బైడెన్ మాత్రం ఆయుధ బేహారిగానే వ్యవహరిస్తున్నారు.



పీడిత ప్రజల బాంధవుడు ఎస్ఆర్ శంకరన్

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు, పీడిత వర్గాల బాంధవుడు ఎస్ఆర్ శంకరన్. తెలుగు రాష్ట్రాలలో ఆయన గురించి తెలియని వారు బహుశా ఉండరు. ఏ శాఖ బాధ్యతలు నిర్వర్తించినా సమాజహితం కోసమే పని చేశారు. రాజ్యాంగానికి లోబడి పని చేస్తూనే ఉత్తమ ఫలితాలు సాధించిన శంకరన్ తరతరాలకు స్ఫూర్తిదాయకం.

భారత రాజ్యాంగాన్ని ఔపోసనపట్టి, నిర్వచించి 'సంక్షేమం' అనే పదానికి అర్థం చెప్పి అమలులోకి తెచ్చిన మహామనిషి. ఐఏఎస్ అధికారిగా తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని పేదలకు సేవ చేయడానికి ఉపయోగించుకున్న ఎస్ఆర్ శంకరన్ ధన్యజీవి. సఫాయి కార్మిక (మ్యాన్యువల్ స్కావెంజర్) వ్యవస్థ అంతానికి ఎనలేని కృషిచేశారు. సఫాయి కర్మచారి ఆందోళన్ కన్వీనర్, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్‌తో కలిసి సఫాయి కర్మచారి ఉద్యమంలో పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని అందిపుచ్చుకుని దళిత, ఆదివాసీల అభ్యున్నతి కోసం, సఫాయి కర్మచారి వృత్తి విముక్తి కోసం శంకరన్ జీవితాంతం కృషి చేశారు. పదవీవిరమణ తర్వాత కూడా కేంద్రప్రభుత్వం అనేకమార్లు శంకరన్ సేవలు వినియోగించుకునేందుకు ప్రయత్నించినా, ఆయన సున్నితంగా తిరస్కరించి సఫాయి కర్మచారి ఆందోళన్‌కే అంకితమయ్యారు.

చట్టాలకు, రాజ్యాంగానికి లోబడి ఎవరినీ నొప్పించకుండా అనేక సంక్షేమ పథకాలకు ఊపిరిపోశారు. గిరిజన, దళిత, పేదల శ్రేయస్సు కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిది. బడుగు జీవుల సంక్షేమానికి దిశానిర్దేశం చేసిన ఎస్ఆర్ శంకరన్ జీవితం ఐఏఎస్ అధికారులకే ఆదర్శంగా నిలిచింది. అందుకే ఆయనను ఐఏఎస్ గాంధీగా పిలుస్తారు. నెల్లూరు జిల్లా ప్రజలు నేటికీ శంకరన్‌ను తమ కలెక్టర్ శంకరయ్యగా గుర్తుపెట్టుకుని ఆరాధిస్తున్నారంటే ఆయన సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దేశంలో అట్టడుగు ప్రజలకు చట్టాలు, సంక్షేమ ఫలాలు అందడం లేదనే ఆవేదనతో ఐఏఎస్ అయినప్పటికీ గిరిజన, దళిత, పేదల కోసం ఎస్ఆర్ శంకరన్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. సమాజాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, ఎస్సీ, ఎస్టీ దురాగతాల చట్టం; ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు చేసిన కృషి మరవలేనిది. బ్రాహ్మణ కులంలో పుట్టిన శంకరన్ బహుజనుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయం. దళితులపై శంకరన్ అవ్యాజమైన ప్రేమ చూపించారు. వ్యక్తిగత జీవనశైలిలో నిరాడంబరతతో మెలిగి మానవతా, ఉన్నత విలువలు కాపాడుకున్న ధన్యజీవిగా నిలిచారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు, ఐటీడీఏ వంటివి ఏర్పాటు ఆయన కృషి ఫలితమే. వ్యవసాయ కార్మికులు, పేదలు, దళితులు, గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేందుకు సిఫార్సులు చేసేందుకు కోనేరు రంగారావు భూకమిటీ ఏర్పాటులో శంకరన్ కృషి ఎనలేనిది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టాల రూపకల్పనలోనూ కీలకపాత్ర పోషించారు. భావితరాలకు ఉద్యోగ ధర్మం తెలియజెప్పిన మార్గదర్శి శంకరన్. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మావోయిస్టులతో చర్చలు జరపడంలో శంకరన్ పాత్ర ఎంతో ఉన్నది. ఆయన జీవితాన్ని, పనితనాన్ని, సాధించిన విజయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(నేడు ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా)

- ఎం.మురళీకృష్ణ

దేశ ఔన్నత్య రక్షణకు ఐక్యపోరాటం

డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు, అనంతరం పార్లమెంటు ఎన్నికలు జరగనున్నప్పటికీ దేశంలో పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయి. అధికారంలో ఉన్న శక్తులు కుటిల యోచనతో సామాజిక, రాజకీయ విధానాన్ని మత ఆధారిత హిందూ రాష్ట్రంగా మార్చుచేసే పనిలో ఉన్నారు. మెజారిటీ మత ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్లకు అప్ప గిస్తున్నారు. సుదీర్ఘకాలంగా అణగారిన ప్రజలను వేధిస్తున్నారు. ఈ శక్తులకు స్త్రీలపై ఏమాత్రం గౌరవంలేదు. ప్రజాస్వామ్యం నాశనమవుతున్నదని చెప్పడానికి అనేక దృష్టాంతాలున్నాయి. న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం ఆధునిక భారతదేశం నిర్మాణానికి పునాదులు. సామ్రాజ్యవాదుల వ్యతిరేకపోరాట అనుభవాలు,పాఠాల ద్వారా ఆధునిక, సెక్యులర్ సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాము.

అత్యంత స్పష్టంగా రాష్ట్రాల ఏర్పాటుకు రాజ్యాంగం అవతారిక కీలకమైంది. వలసపాలనకు వ్యతిరేకంగా మహత్తర పోరాటం నుంచి నేర్చుకున్న పాఠాలు ఎంతో ప్రాముఖ్యమైనవి. బహుళ, ఫెడరల్, సమత్వ ఇండియా నిర్మాణానికి నేర్చుకున్న పాఠాలు ప్రధానమైనవి. నేర్చుకున్న పాఠాలు అనేక విధాలైనవి. ఒకదానితో మరొకటి అనుసంధానమైనవి కూడా. సుదీర్ఘ చర్చల ద్వారా నిర్మించుకున్న దేశ పునాదులను ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. నేడు రాజ్యాంగం నిర్మాణ పునాదులను పెకలించాలని చూస్తున్నారు. నిరంకుశ సంకెళ్ల నుండి దేశాన్ని రక్షించాలన్న పోరాటం ద్వారా స్ఫూర్తి పొందాలి.

నేటి రాజకీయం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఒంటెద్దు పోకడతో సంఘ్‌పరివార్ నాయకత్వంలో మతాన్ని విస్తరిస్తున్నారు. రాజ్యాంగాన్ని చులకనగా చూడటమేగాక, దాన్ని ధ్వంసంచేయాలని ప్రయత్నం చేస్తున్నారు. పాలనపట్ల ఎలాంటి జవాబుదారీతనం, పారదర్శకతలేదు. హింసను, విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ఏ మాత్రం వెనుకడుగు వేయడంలేదు. స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాలు పాల్గొనలేదు. విదేశీ పాలనను పూర్తిగా నిర్మూలించాలనేది ప్రధాన లక్ష్యం. అణచివేత, భూస్వామ్య విధానం, ఫ్యూడల్ తరహా ఉత్పత్తి, కుల వారసత్వం, సామ్రాజ్యవాద వ్యవస్థలో భాగం. దీనిపై వివిధ సందర్భాలలో అనేకమంది చర్చించారు. ఈ వైవిధ్యం కలిసి దృఢమైన అవగాహనతో క్రియాశీలత ద్వారా దేశ నిర్మాణం జరిగింది. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కేంద్రంగా దేశ నిర్మాణం సాగింది. సంపద్వంతమైన చరిత్రను ఆర్‌ఎస్‌ఎస్, హిందూ హహాసభలు తిరస్కరించాయి. చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటం ముగిసేదశలో క్విట్‌ఇండియా ఉద్యమం జరిగింది. కమ్యూనిస్టులు నావికుల తిరుగుబాటు ఉద్యమాన్ని

బలపరిచారు. హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని కొద్దిమంది సంకుచితత్వంతో డిమాండ్ చేశారు. రాజ్యాంగ అసెంబ్లీలోనూ డిమాండ్ చేయగా, డాక్టరు అంబేద్కర్ తిరస్కరించారు. హిందూరాజ్యం ఏర్పడిఉంటే దేశం తీవ్ర కల్లోలానికి గురై ఉంటుంది. మతరాజ్యం ఏర్పాటు చేయకుండా ప్రజాస్వామ్య, సెక్యులర్ సూత్రాల ఆధారంగా అందరికీ సమాన పౌరసత్వం ఇవ్వడం ద్వారా రాజ్యాంగ రూపకర్తలు గొప్ప మేలుచేశారు.

ప్రజలను విభజించాలనుకునేవారు అపజయం పొందారు. అన్ని నేపథ్యాలు కలిగిన ప్రజలు చేయి చేయి కలిపి శాంతి, పురోగతివైపు ముందుకుసాగారు. భగత్‌సింగ్, అషఫుల్లా ఖాన్, మగ్దూం మొహిద్దీన్, అరుణ అసఫ్ అలీ, సుభాష్ చంద్రబోస్, అబ్దుల్ గఫార్ ఖాన్, గాంధీలు అంకితమైన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. సంక్షేమ రాజ్యానికి సోషలిజం ప్రధానంగా ఉండాలని అంబేద్కర్ కోరారు. ఒకే మతం కావాలనుకునే శక్తుల ఐక్యత, సామరస్యాలను నాశనం చేయాలని నిశ్చయించుకున్నారు. చీలికలను, వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపేందుకు క్రియాశీలంగా చొరవలు తీసుకోవాలని అంబేద్కర్ కోరారు. అసమానతలు కల్లోలానికి దారితీస్తుందన్నారు. అలాగే ప్రజాస్వామ్య పంథాలో సమాజం నడవాలంటే వర్గం, కులం, స్త్రీ,పురుషులు, ప్రాంతాలమధ్య గల తేడాలు సమసిపోవాలి. సంక్షేమరాజ్యం తప్పనిసరి అని, కార్మికహక్కులు, పోషకాహారం, కనీస వేతనాలు, మంచినీరు, ప్రసూతి ప్రయోజనాలు, సామరస్యతగల సమాజం కావాలని కోరారు. ఈ ఆలోచనలన్నీ సామాజిక విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాల్లో ఉన్నాయి. అయితే అవి నెరవేరలేదు. ఫలితంగా తీవ్ర ముప్పు ఏర్పడింది. సామాజిక వ్యవస్థ తిరోగమనంపట్టి అత్యంత తీవ్రమైన అభద్రత ప్రజలలో ఏర్పడింది. ప్రత్యేకించి యువతలో అభద్రత పెరిగింది. సమాజం మితవాద తీవ్రవాదంలో చిక్కుకుంది. మన చరిత్రను తిరిగి రాయడానికి, మన జాతీయతను నిర్వచించడానికి ఇప్పటికే గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సమాజంలో తీవ్రమైన కలహాలను నింపేందుకు ఆర్‌ఎస్‌ఎస్ పూనుకున్నది. సామాజికరంగం దిగజారిపోతోంది. ఈ అజెండాలో కార్పొరేట్లు భాగంగా ఉన్నాయి. సామాజిక వ్యవస్థ వారసత్వాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. కులవ్యవస్థను నిర్మూలించేందుకు అంబేద్కర్ జీవితాంతం పోరాడారు. "ఒక జాతి అభివృద్ధిని మహిళలు సాధించిన పురోగతి ద్వారా నేను అంచనావేస్తాను" అని అంబేద్కర్ అన్నారు. నేడు ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీలు దిగువ, మధ్య తరహా కులాలను హిందుత్వ శక్తులలో చేర్చుకుంటున్నారు. బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్‌లు తమ బ్రాహ్మణత్వాన్ని కాపాడుకుంటున్నారు. ఇంకా మనుస్మృతిని కొనసాగించేందుకు కంకణం కట్టుకున్నారు. ఇవి సామాజిక, న్యాయ, రాజకీయాలకు వ్యతిరేకమైనవి. సామాజిక, ఆర్థిక న్యాయం, సమాజ విముక్తికోసం ప్రభుత్వరంగాన్ని ఒక పంథాగా ఏర్పాటుచేశారు. మోదీ ప్రభుత్వం తన కార్పొరేట్ స్నేహితులకు ప్రభుత్వరంగాన్ని విక్రయిస్తూ సామాజిక న్యాయాన్ని నిర్మూలిస్తున్నారు. ప్రభుత్వరంగం లేకపోతే స్థిరంగా ఉద్యోగాలు ఉండవు. బలమైన సంక్షేమరాజ్యం నిర్మించడంద్వారా లౌకికతత్వం, సామాజిక న్యాయం సాధించవలసి ఉంది. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మతరాజ్యంవైపు, బ్రాహ్మణవాద రాజ్యంవైపు పయనిస్తున్నారు. ప్రస్తుత రాజ్యాంగం స్థానే మరో రాజ్యాంగాన్ని రూపొందించాలని బహిరంగంగానే కోరుతున్నారు. మన రిపబ్లిక్‌ను కాపాడుకునేందుకు పోరాటం సాగించాలి. అయితే తరచుగా ఈ లక్ష్యాన్ని మరచిపోతున్నారు. మనం ప్రేమిస్తున్న భారతదేశాన్ని రక్షించేందుకు పోరాటంజరపాలి. మతతత్వం, కులతత్వం, ఆశ్రితపక్షపాతం నిర్మూలనకు బహువిధ పోరాటాలను సాగించాలి. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా గొప్పపోరాటాన్ని నిర్వహించాం. సమాజంలో ఎలాంటి చీలికలులేకుండా అన్నివర్గాల ప్రజలు స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. తమ మనస్సుల్లో ఉన్న విద్వేషాన్ని తొలగించేందుకు, ప్రజలను ఐక్యం చేసేందుకు ఈ పోరాటం జరిగింది. అంతేకాదు, వీరి హక్కులపైన దాడులను నివారించేందుకు పోరాటం సాగించాలి. నిరుద్యోగం, ఆకలిలేని సమాజంకోసం లౌకికతత్వం, సామాజిక న్యాయంకోసం అసమానతలు రూపుమాపడానికి ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీలను తప్పనిసరిగా ఓడించాలి. మన స్వాతంత్రపోరాటంలో పెట్టుకున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక లక్ష్యాన్ని సాధించాలని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీలు మన సామాజిక, రాజకీయ, ఆర్థికంగా సృష్టిస్తూ ప్రచారం చేస్తున్న రుగ్మతలకు సరైన పరిష్కారమిదే.

సంత్ కబీర్ మానవవాదం

డాక్టర్ దేవరాజు మహారాజు

సాధారణ శకం పదిహేనవ శతాబ్దానికి చెందిన సంత్ కబీర్ దాస్ (1308-1518) బహుజన తాత్త్వికుడు, కవి. ఆనాటి సామాజిక స్థితిగతులపై తన దృఢమైన అభిప్రాయాల్ని వెలిబుచ్చినవాడు. విచారించవల్సిన విషయమేమంటే ఆరు శతాబ్దాల తర్వాత, నేటి సమాజంలో జన బాహుళ్యం, ఆయన ఆలోచనలతో పోలిస్తే ఇంకా వెనకబడే ఉన్నారు. ఇంకా మూఢ నమ్మకాల్లో మునిగి తేలుతున్నారు ఇంకా బ్రాహ్మణవాద కుట్రల్లోంచి బయటపడలేక పోతున్నారు. సంత్ కబీర్‌దాస్ తన భావాల్ని ఆనాటి హిందీ భాషలో నాటి స్థితిగతుల్ని 'దోహే' అనే కవితా ప్రక్రియలో ప్రకటించాడు. అందులో కొన్ని నేనిక్కడ పొందు పరుస్తున్నాను. హిందీ తెలిసిన వారికి అర్థం చేసుకోవడం సులభమే. చేసుకోని వారికోసం నేను ఇక్కడ తెలుగు సారాంశం ఇస్తున్నాను. చేయవల్సిందల్లా ఎవరికి వారు ఆత్మవిమర్శ చేసుకోవడమే. వైజ్ఞానిక ప్రగతి సాధించుకున్న 21వ శతాబ్దంలో జీవిస్తూ, అత్యాధునికులై ఉండి, ఈ కాలానికి తగినట్టు ఆలోచిస్తున్నారా? లేక ఆరు వందల ఏళ్ళకు పూర్వం జీవించిన సంత్ కబీర్ స్థాయిని కూడా అందుకోలేక పోతున్నారా ? అన్నది ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిందే!

పాత్తర్ పూజే హరీ మిలే, తొమై పూజూ పహాడ్ !
షర్ కి చాకీ కోయీన పూజే జూక్ పీస్ ఖాయే సంసార్ 11

రాయిని పూజిస్తే హరి(దేవుడు) దొరుకుతాడని అనుకుంటే, చిన్న రాయినే ఎందుకూ? నేను పెద్ద గుట్టనే పూజిస్తా. అయినా, దేవుడు కనబడడమన్నది అబద్ధం. అయితే, ఇంట్లో రోజూ దానాన్ని పిండిగొట్టి ఆకలితీర్చే విసుర్రాయి కూడా రాయే. దాన్ని ఎవరూ గుర్తించరు. అవసరమైన వాటిని వదిలేసి, అనవసరమైన వాటికి ప్రాధాన్యమిస్తున్నారని సంత్ కబీర్ చెపుతున్నాడు. ప్రాణాన్ని నిలబెట్టేది, జీవితాన్ని కొనసాగించేది విసుర్రాయి. అది ఓ మూల పడి ఉంటుంది. విసుర్రాయితో పోలిస్తే పూజించే రాయికి ఏ మాత్రం విలువ లేదన్ని సత్యాన్ని ఆయన స్పష్టంగానే చెప్పాడు.

మాటీక ఎక్ నాగ్ బనాకె పూజే లోగ్ లుగాయా
జిందా నాబ్ జబ్ ఘర్ మే నికలే లేలారీ ధమ్ కోయా11

మట్టితో నాగుపాము బొమ్మ చేసుకుని ఇంట్లో పూజించే జనం నిజంగానే పాము ఇంట్లో కొస్తే ఏం చేస్తారూ? పూజిస్తారా? కర్ర తీసుకుని బయటికి తరిమేస్తారు. లేదా చితక్కొట్టి చంపేస్తారు. తమ క్షేమం తాము చూసుకుంటారు. దీనితో ఏం అర్థమౌతుందీ? నిజాన్ని పారద్రోలి, అబద్ధాన్ని పూజించడం మనుషుల లక్షణం- అని తెలుస్తోంది కదా? ఎందుకీ పిచ్చి ప్రవృత్తి? ప్రేమ, సమర్పణ భావం లేకుండా ఊరికే భయపడి దైవాన్ని పూజించడం మూర్ఖత్వం కదా? అన్నది కబీర్ భావన

ఐసీ బాణీ బోలియే మనక ఆపా ఖోయ్!
ఔరన్ కో శీతల్ కరే ఆపహు శీతన్ హెూయ్

ఎదుటివాడు ఏ జాతి వాడు, ఏ మతం వాడు, ఏ ప్రాంతం వాడు అనేది చూడకుండా మనిషిని మనిషిగా గుర్తించి ప్రేమతో, గౌరవంగా మాట్లాడితే- మీ ఇద్దరి మధ్య సంబంధం చల్లగా ఉంటుంది. అనవసరంగా ఎదుటి వాణ్ణి అగౌరవ పరుస్తూ కోపం వెళ్ళ గక్కితే - ఎదుటి వాడు కూడా అదే పని చేయొచ్చుకదా ? అప్పుడు మీ పరిస్థితి ఏమిటీ? మీ విలువ, మీ గౌరవం ఎక్కడ ఉంటుంది ? ఈ చిన్న విషయం పాటించకనే కదా మన సమాజంలో మనువాదులు మనుషుల మధ్య అగాధాలు పెంచిందీ ?

బ్రాహ్మణవాదం ప్రచారంచేసిన వర్ణ వివక్షను, మూర్ఖపు ఆచారాలను అలాగే కొన్ని జీవన సత్యాలను కబీర్ తన దోహాలలో స్పష్టం చేశాడు. అప్పటికి, నాస్తిక వాదం, హేతువాదం, మానవ వాదం లాంటి పదాలే పుట్టలేదు. అయినా క్రాంతిదర్శి, దార్శనికుడు అయిన బహుజన మేధావి సంత్ కబీర్ అవన్నీ అయ్యాడు. తన సమకాలీన ప్రజ్ఞానీకాన్ని ఆలోచించమని కోరాడు. ఇన్నేళ్ళ తర్వాత, ఇప్పటికీ ఆదర్శంగానే నిలబడి ఇకనైనా మేల్కొనండి. మీరేమిటో మీరు గుర్తించుకోండి అని మనల్ని హెచ్చరిస్తున్నాడు. 'మనుషులంతా ఒక్కటే అని గ్రహించండి. భేదభావం విడనాడండి. మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు నిలుపుకోండి - అని ఎలుగెత్తి చాటుతున్నట్లుగా అనిపిస్తుంది. ఈ కాలానికి కూడా ఆయన స్ఫూర్తి ప్రదాతే నన్నది మనం గుర్తుంచుకోవాలి!

మల్ మల్ ధోయే శరీర్ కొ ధోయే న మన్‌క మైల్ 1
సహాయ గంగా, గోమతి, రహే బైల్ క బైల్ 11

మనసులోని మైలను శుభ్రం చేసుకోకుండా గంగా, గోమతి వంటి నదులలో స్నానం చేస్తే పుణ్యం వస్తుందని, మోక్షం లభిస్తుందని జనాన్ని ఊదర కొట్టిన వైదిక మత ఆచారాలను ఎద్దేవా చేశాడు కబీర్ దాస్. మనసులోని కల్మషాన్ని పోగొట్టుకోకుండా, మనసు నిర్మలం చేసుకోకుండా వరుస బెట్టి నదీస్నానాలు చేసినంత మాత్రాన ఏం లాభం? ఖరీదైన మల్‌మల్ గుడ్డను ఉతికినట్టు

సున్నితంగా, సుతారంగా ఈ శరీరాన్ని పైపైన ఉతికితే ఏం లాభం? ఎన్ని పవిత్ర స్నానాలు ఆచరించినా ఎద్దు ఎద్దులాగే ఉంటుందని ఎద్దేవా చేశాడు. ఎద్దు బలమైందే. బ్రాహ్మణ వాదమూ బలమైందే.... కానీ, వాటికి మనిషిలా ఆలోచించే మెదడు లేదుకదా ?

హిందూ కహే మొహీ రామ్ ప్యారా, తుర్ కహే రహమాన్1
ఆపస్ మె దోవు లడీ మరయే, మరమ్ న కోవు జాన్11

హిందువులు తమకు రాముడు ఇష్టం - అని అంటారు. ముస్లింలు రెహమాన్ అని అంటారు. ఈ అభిప్రాయ భేదాలతో ఇరువర్గాలు తన్నుకు ఛస్తారు. పరిష్కార మార్గం వారికి తెలియడం లేదు. శతాబ్దాలుగా ఇది చూస్తూనే ఉన్నాం. మతాల పేరుతో ఘర్షణలు మాని, మతాలకు అతీతంగా, మానవవాదులుగా మారడం ఒక్కటే పరిష్కారం!

కబీరా కహే యె జగ్ అంధా, అంధీ జైసీ గాయ్ !
బచ్ డా థా సొ మర్‌గయా, ఝూటీ చాయ్ చటాయె !!

సమకాలీన ప్రపంచంలో, ముఖ్యంగా మన దేశంలో ప్రభుత్వాల పనితీరుకు దీన్ని అన్వయించుకోవచ్చు. ఆవు దూడ చనిపోతే, గడ్డితో ఆవుదూడ బొమ్మను తయారుచేసి - ఆవును మోసం చేసి, పాలు పితుక్కుంటారు...కదా? అలాగే, ప్రజలకు అందివ్వాల్సింది అందివ్వకుండా, వారి నుండి లాక్కునేది లాక్కోవడం నేటి రాజకీయ వ్యవస్థ చేస్తున్న పని. దేశ ప్రజల ముందు గడ్డి బొమ్మలు పెట్టి, వారి నుండి అన్నిరకాల పన్నులు వసూలుచేసే మోది ప్రభుత్వం ఒకటి వస్తుందని ఆరువందల ఏళ్ళకు ముందే సంత్ కబీర్ దాస్ ఊహించినట్టున్నాడు. కవి దార్శనికుడు కావడం అంటే ఇదే-

కబీర్ దాస్ కవితల్లో ఏ ఒక్కటి తీసుకున్నా అది ఆనాటి సమాజ రుగ్మతల్ని చీల్చి చెండాడడం కనిపిస్తుంది. వందల ఏళ్ళు గడిచినా ఆరుగ్మతలు రుగ్మతలుగానే కొనసాగుతున్నందుకు మనమంతా సిగ్గుపడాలి. ఆయన కవితా చరణాల వెంట నడుస్తూ, అందులో భావం, భావుకత, అంతకు మించి సమాజ శ్రేయస్సుకు ఆయన ఎంత తపించారో అర్థం చేసుకోవాల్సి ఉంది. వారణాసికి చెందిన ఈ కవి ఆలోచనలు హిందువులని ముస్లింలని, సిక్కులని బాగా ప్రభావితం చేశాయి. ఆయన జీవించిన కాలంలో ఆయన పై దాడులకు దిగిన హిందువులున్నారు, ముస్లింలూ ఉన్నారు. ఆయన మరణానంతరం ఆయన తమ వాడేనని ఈ ఇరు వర్గాలు వదిలేసి ప్రకటించుకున్నాయి. ఆయన మాత్రం తన రచనల్లో అన్ని మతాల మత పిచ్చిని తీవ్రంగా దూషించాడు. కబీర్ ఆలోచనలకు సిక్కు మత గురువు గురునానక్ ప్రభావితుడయ్యాడని చెపుతారు. అందుకే కాబోలు, వారి మతగ్రంథంలో ఈయన ఆలోచనలకు చోటు దొరికింది. విశ్వకవి రవీంద్రుడు కూడా కబీర్ భావాలకు ముగ్ధుడై కొన్నింటిని అనువదించాడు.. నిజాన్ని బతికించుకుంటేనే మనిషి ప్రశాంతంగా బతకగలడు! అన్నది కబీర్ బోధనల సారాంశం!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

విశాలాంధ్ర

5

ఆదివారం

22 అక్టోబరు 2023

ఇజ్రాయిల్ తక్షణమే పలస్తీనాను వీడాలి

మెహబూబా ముఫ్తీ డిమాండ్, శ్రీనగర్‌లో నిరసన ప్రదర్శన

శ్రీనగర్: గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులను పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. దీని వల్ల రానున్న రోజుల్లో ప్రపంచం తీవ్ర దుష్ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించారు. పలస్తీనా నుంచి ఇజ్రాయిల్ వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. పీడీపీ నేతృత్వంలో శనివారం ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. ముఫ్తీ పలస్తీనా జెండాతో నడిచారు. షేర్ ఏ కశ్మీర్ పార్క్ సమీపంలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చిన పీడీపీ కార్యకర్తలు లాల్ చౌక్ సిటీ సెంటర్‌కు కదం తొక్కారు. మార్చ్‌ను జనరల్ పోస్టాఫీసు (జీపీఓ) వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రదర్శనకారులు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఫ్తీ విలేకరులతో మాట్లాడుతూ గాజాలో 1500 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది అమాయకులు చంపేస్తున్నారు. ప్రపంచం మాత్రం మౌన ప్రేక్షకుని ఉంది. ఉక్రెయిన్‌లో రెండేళ్లలో 500 మంది పిల్లలు చనిపోతే యావత్ ప్రపంచం కన్నీరు కార్చింది. మరిప్పుడేమో మౌనం వహిస్తోంది. ఇప్పటికే ప్రపంచంలో ఉగ్రవాదం తీవ్రంగా ఉంది. ఈ యుద్ధం వల్ల జరుగుతున్న అన్యాయం మరింత మందిని తుపాకీ పట్టేలా చేయగలదు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం పేట్రేగిపోవచ్చు. కాబట్టి పలస్తీనాను అణచివేస్తున్నా ఇజ్రాయిల్ తక్షణమే అక్కడ నుంచి వెళ్లిపోవాలి' అని అన్నారు. పలస్తీనా ప్రజలకు ఆహారం, మంచినీరు, మందులు అందకుండా చేయడమే కాకుండా అమాయకులపై బాంబులతో దాడి చేస్తోందని దుయ్యబట్టారు. ఇజ్రాయిల్ వినాశకారి చర్యల కారణంగా రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు తప్పబోవని హెచ్చరించారు.

ఉగ్రవాదం, తిరుగుబాటు తగ్గాయి

- ఈశాన్య రాష్ట్రాలు ప్రశాంతం
- కఠిన చట్టాల ఫలితమే
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదం, మావోయిస్టులు, తిరుగుబాటు ఘటనలు 65 శాతం తగ్గాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం తెలిపారు. దేశం 'మూడు హాట్‌స్పాట్‌లు-ఎల్‌డబ్ల్యూఈ (మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు), ఈశాన్య, జమ్ముకశ్మీర్ శాంతియుతంగా మారుతున్నాయని కూడా ఆయన నొక్కి చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ కఠినమైన చట్టాలను రూపొందించిందని ఆయన తెలిపారు.

ఇక్కడ జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో హోం మంత్రి ప్రసంగించారు. పోలీసు బలగాల ఆధునీకరణ కోసం 'పోలీస్ టెక్నాలజీ మిషన్' ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రపంచంలోనే అత్యుత్తమ ఉగ్రవాద నిరోధక దళాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. నేర న్యాయ వ్యవస్థను సమగ్రంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం మూడు బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టిందన్నారు. ఈ మూడు చట్టాలు 150 ఏళ్ల నాటి చట్టాలను భర్తీ చేస్తాయని, ప్రతి పౌరుడికి అన్ని రాజ్యాంగ హక్కులకు హామీ ఇస్తాయని, ప్రతిపాదిత చట్టాలు భారతీయతను కూడా ప్రతిబింబిస్తాయని మంత్రి అన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు ముగింపు పలకాలని ప్రధాని మోదీ దృష్టి సారించారని తెలిపారు. 'ధైర్యవంతమైన పోలీసు సిబ్బంది కృషి, విజయాల కారణంగా గత దశాబ్దంలో ఈశాన్య ప్రాంతంలో ఉగ్రవాదం, మావోయిస్టుల కార్యకలాపాలు, తిరుగుబాటు సంఘటనలు గరిష్ఠ స్థాయి నుంచి 65 శాతం పడిపోయాయి' అని షా చెప్పారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలన్నా, నేరాలను అరికట్టాలన్నా, గుంపును ఎదుర్కొంటూ శాంతిభద్రతలను కాపాడాలన్నా, విపత్తులు, ప్రమాదాల సమయంలో పౌరులను రక్షించాలన్నా, కోవిడ్-19 మహమ్మారి వంటి క్లిష్ట సమయాల్లో ముందు వరుసలో ఉండాలన్నా పోలీసు సిబ్బంది తమను తాము నిరూపించుకున్నారని అన్నారు. అప్రమత్తమైన పోలీసు వ్యవస్థ లేకుండా ఏ దేశ అంతర్గత భద్రత, సరిహద్దు భద్రత సాధ్యం కాదని షా అన్నారు. విపత్తులో పోలీసు సిబ్బంది పోషించిన పాత్రను ప్రస్తావిస్తూ, గతంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ (జాతీయ విపత్తు స్పందన దళం) ద్వారా వివిధ పోలీసు బలగాలకు చెందిన సిబ్బంది విపత్తు నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించారని అన్నారు. ఎంత పెద్ద విపత్తు వచ్చినా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నప్పుడు, ఇప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్ వచ్చినందున ఇబ్బంది లేదని ప్రజలకు నమ్మకం కలుగుతుందని ఆయన అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక పథకాలను ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వాటిని మెరుగుపరిచేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని షా అన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశానికి సేవ చేస్తూ ప్రాణాలర్పించిన 36,250 మంది పోలీసు సిబ్బందికి నివాళులు అర్పిస్తూ, ఈ పోలీసు స్మారక చిహ్నం కేవలం ప్రతీక కాదని, దేశ నిర్మాణం కోసం పోలీసు సిబ్బంది త్యాగం, అంకితభావానికి గుర్తింపు అని అన్నారు. అక్టోబరు 21, 1959న, లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద భారీగా ఆయుధాలను కలిగి ఉన్న చైనా దళాలు జరిపిన ఆకస్మిక దాడిలో 10 మంది పోలీసులు విధి నిర్వహణలో మరణించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 21 ఈ అమరవీరులను, విధి నిర్వహణలో మరణించిన ఇతర పోలీసు సిబ్బందిని స్మరించుకుంటున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018లో పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా చాణక్యపురిలోని జాతీయ పోలీసు స్మారకం (ఎన్‌పీఎం) ను జాతికి అంకితం చేశారు.

ఈ స్మారకం కేంద్ర శిల్పం, 'వాల్ ఆఫ్ శౌర్యం' మ్యూజియాన్ని కలిగి ఉంది. 30 అడుగుల ఎత్తయిన గ్రానైట్ ఏకశిలా సమాధి అయిన కేంద్ర శిల్పం, పోలీసు సిబ్బంది బలం, స్థితిస్థాపకత, నిస్వార్థ సేవను సూచిస్తుంది. అమరవీరుల పేర్లు చెక్కబడిన 'వాల్ ఆఫ్ వాల్' స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు సిబ్బంది ధైర్యసాహసాలకు, త్యాగానికి స్థిరమైన గుర్తింపుగా నిలుస్తుంది. మ్యూజియం భారతదేశంలో పోలీసింగ్‌పై చారిత్రక, అభివృద్ధి చెందుతున్న ప్రదర్శనగా భావిస్తున్నారు.

మా డిమాండ్ల నెరవేర్చకుంటే

25 నుంచి మళ్లీ ఆందోళన

మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జారంగే

అఖ్లూజ్ : తమ సామాజిక వర్గం డిమాండ్లను నెరవేర్చకపోతే అక్టోబరు 25 నుంచి తాజా ఆందోళన చేపడతామని మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జారంగే తెలిపారు. షోలాపూర్ జిల్లాలోని అఖ్లూజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరాఠా సామాజిక వర్గానికి ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి తన అల్టిమేటం అక్టోబరు 24 వరకు ఉందన్నారు. 'ప్రభుత్వం ఏమి చేస్తుందో నాకు తెలియదు. రేపు జాల్నాలోని అంతర్వాలి గ్రామంలో మా తదుపరి కార్యాచరణను రూపొందించడానికి మేము సమావేశం నిర్వహిస్తాము. మరాఠా సమాజం శాంతియుత ఆందోళనను ప్రభుత్వం తట్టుకోలేకపోతుంది' అని ఆయన అన్నారు. ఆగస్టు 29న జల్నాలోని అంతర్వాలి సారతిలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత జరాంగే రాష్ట్ర రాజకీయాల్లో మరాఠా కోటా ప్రకంపనలు తెచ్చారు. సెప్టెంబరు 1న నిరాహారదీక్ష వేదిక వద్ద పోలీసు చర్యలో అనేక మందికి గాయాలయ్యాయి. సెప్టెంబరు 14న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను వేదిక వద్ద కలుసుకుని ప్రభుత్వం తన డిమాండ్లపై సానుకూల వైఖరి తీసుకుంటుందని హామీ ఇవ్వడంతో జరాంగే తన నిరాహార దీక్షను ముగించారు. ఆ సమయంలో జారంగే మాట్లాడుతూ, మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఆందోళనకారులు రాష్ట్ర ప్రభుత్వానికి 'ఒక నెల సమయం' ఇచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గ కోటాను ప్రకటించడానికి ప్రభుత్వానికి అక్టోబరు 24 గడువుగా నిర్ణయించారు.

నా డబ్బు లాక్కొని వెళ్లగొట్టారు

కుటుంబ సభ్యులపై ఉన్నావో బాధితురాలి ఫిర్యాదు

ఉన్నావో (ఉత్తర ప్రదేశ్) : 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచారం కేసులో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ దోషిగా తేల్చిన బాధితురాలు తన బంధువులపై ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి తనకు వచ్చిన డబ్బును లాక్కొని, తనను ఇంటి నుంచి వెళ్లగొట్టినట్లు ఆరోపించినట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఆ బాధిత మహిళ ఫిర్యాదు మేరకు... ఆమె మామ, తల్లి, సోదరి, మరొక వ్యక్తిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 406 (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన), 506 (నేరపూరిత బెదిరింపు) కింద గురువారం మఖీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయినట్లు అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) శశి శేఖర్ సింగ్ తెలిపారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించామని, వచ్చిన వాస్తవాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతం వివాహమై ఎనిమిది నెలల గర్భిణీ అయిన తనకు కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు, బెదిరింపులు వస్తున్నాయని ఆ బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. 'కోర్టు ఆదేశాలపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నాకు డబ్బు ఇచ్చాయి. నా అవసరాలు, ఖర్చుల కోసం నేను మా కుటుంబం నుంచి డబ్బు అడిగినప్పుడు మా మామ ఈ కేసు కోసం రూ.7 కోట్లు ఖర్చు చేశామని, వచ్చిన డబ్బు సరిపోదని, అతనికి మరింత డబ్బు కావాలని కోరాడని ఆమె ఆరోపించింది. హత్యాయత్నం కేసులో తన మామ తీహార్ జైలులో పదేళ్ల శిక్ష అనుభవిస్తున్నట్లు ఆమె పేర్కొంది. అతని సూచనల మేరకు 'నా తల్లి, సోదరి నాకు, నా భర్త జీవితానికి శత్రువులుగా మారారు' అని ఆమె ఆరోపించింది. ప్రభుత్వం నుంచి తనకు లభించిన ఇంటి నుంచి తనను, తన భర్తను బయటకు నెట్టారని, తన కుటుంబ సభ్యులు అతనిని 'లక్ష్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా ఆరోపించింది. 2017లో ఉన్నావ్ జిల్లాకు చెందిన అప్పటి బీజేపీ ఎమ్మెల్యే సెంగార్ తనను అపహరించి, అత్యాచారం చేశాడని అప్పుడు మైనర్ అయిన మహిళ ఆరోపించింది. ఈ కేసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో ఆయనను పార్టీ బహిష్కరించింది. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టు 2019 డిసెంబరు 20న సెంగార్‌ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. ఆయన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా కోల్పోయారు.

జనగణనతో పాటే కులగణన జరిపించాలి

మోదీకి స్టాలిన్ వినతి

చెన్నై: దేశంలో జనగణనతో పాటే కులగణన జరిపించాలని ప్రధాని మోదీని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. దశాబ్దంలో ఒకసారి జనాభా లెక్కలు వేస్తారు. అదే సమయంలో కులగణన నిర్వహిస్తే చారిత్రకంగా నిలుస్తుందన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదమవుతుందని, శక్తిమంతమైన సమ్మిళిత భారత్ నిర్మాణానికి దారితీస్తుందని తెలిపారు. ఈ విషయంలో స్వయంగా జోక్యం చేసుకోవాలని మోదీకి రాసిన లేఖలో స్టాలిన్ కోరారు. కులగణన ద్వారా సమగ్ర, విశ్వసనీయ డేటా అందుబాటులోకి వస్తుందని, సామాజిక-ఆర్థిక సూచికలను ఇది ప్రతిబింబిస్తుందని ఆయనన్నారు. సమానమైన, సమ్మిళిత అభివృద్ధి దిశగా చర్యలు తీసుకునేందుకు, విధానాలను రూపొందించేందుకు వినియోగమవుతుందన్నారు. దేశంలో ఏ కులం వారు ఎంతమంది ఉన్నారన్నది తేలడంతో పాటు వనరులపైనా స్పష్టత రాగలదని స్టాలిన్ తెలిపారు. జాతీయ స్థాయిలో జనగణనతో పాటు కులగణను నిర్వహించాలని మోదీని కోరారు. అది జరిగినప్పుడు భవిష్యత్‌లో అన్ని వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి, అభివృద్ధికి సమానరీతిలో విధానాలు, కార్యాక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం కలుగుతుందని స్టాలిన్ తెలిపారు. కాగా, కోవిడ్ కారణంగా 2021 నుంచి జనగనణ జరగలేదు.

నీట్‌కు వ్యతిరేకంగా డీఎంకే సంతకాల సేకరణ

చెన్నై: దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్య విద్యా సంస్థల్లో వైద్య కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తోంది. ఆ పోరాటంలో భాగంగా అధికార డీఎంకే శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణను ప్రారంభించింది. డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ తొలి సంతకం చేశారు. నీట్‌కు వ్యతిరేకంగా 50 రోజుల్లో 50 లక్షల సంతకాలు సేకరించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపనున్నారు. కాగా, నీట్ పరీక్ష రాసి అర్హత సాధించని సుమారు 22 మంది తమిళ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం నీట్‌కు వ్యతిరేకంగా గళమెత్తింది. సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఇది ఉందని విమర్శించింది. పట్టణ విద్యార్థులు, కోచింగ్ సెంటర్‌లకు అనుకూలంగా ఉన్న నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. తమిళనాడుకు నీట్‌ను మినహాయించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును రాష్ట్రపతికి పంపింది. ఈ బిల్లు ఆమోదం కోసం డీఎంకే ప్రభుత్వం ఎదురుచూస్తున్నది.

మిజోరం అసెంబ్లీకి 174 నామినేషన్లు

అభ్యర్థులలో 16 మంది మహిళలు, 27 మంది స్వతంత్రులు

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీలో 40 స్థానాలండగా మొత్తం 174 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు శనివారం తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో 16 మంది మహిళలు ఉన్నారన్నారు. నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 23వ గడువు ఉందన్నారు. అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), ప్రతిపక్ష జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం), కాంగ్రెస్ పార్టీల నుంచి నామినేషన్లు వచ్చాయని అధికారులు చెప్పారు. ఎంఎన్ఎఫ్ నుంచి 40 మంది పోటీ చేస్తుండగా వీరిలో 25 మంది ప్రస్తుత శాసనసభ్యులు ఉన్నారు. జెడ్‌పీఎం ఎమ్మెల్యేలు ఆరుగురితో పాటు 40 మంది ఆ పార్టీ నుంచి బరిలో నిలిచినట్లు అధికారులు చెప్పారు. బీజేపీ నుంచి 23 మంది, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి నలుగురు పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. 27 మంది స్వతంత్రులు ఉన్నారన్నారు. మిజోరం అసెంబ్లీకి నవంబరు 7న పోలింగ్ జరగనుంది. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. క్రైస్తవులకు పుణ్యదినమైన ఆదివారం ఎన్నికలు జరగాల్సి ఉండగా పోలింగ్ తేదీ మార్చాలని ఎన్నికల కమిషన్‌ను రాజకీయ పార్టీలు, చర్చీలు, పౌర-విద్యార్థి సంఘాలు కోరాయి. మిజోరం జనాభాలో 87శాతం మంది క్రైస్తవులు ఉన్నారు. అయితే వీరి వినతిపై ఈసీ ఇంకా స్పందించలేదు. కాగా, రాష్ట్రంలో 8,56,968 మంది అర్హులైన ఓటర్లు ఉండగా వీరిలో 4,39,925 మంది మహిళలు ఉన్నారు.

ఆకలి సూచీపై స్మృతి వ్యాఖ్యలకు కనిమొళి ఖండన

చెన్నై : ప్రపంచ ఆకలి సూచీపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేసిన వ్యాఖ్యలను డీఎంకే పార్లమెంటు సభ్యురాలు, పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కనిమొళి శనివారం ఖండించారు. ఈ వ్యాఖ్యలు పోషకాహార లోపం, ఇతర సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రపంచ ఆకలి సూచీపై వ్యాఖ్యానించిన వీడియోను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేస్తూ కనిమొళి... కేంద్ర మంత్రి ప్రపంచ ఆకలి సూచిని అర్థం చేసుకోకుండా అవహేళన చేయడం బాధాకరమని అన్నారు. ఈ వీడియోలో భారతదేశ కథనాన్ని ప్రదర్శించని, ఉద్దేశపూర్వకంగా సూచీలు ఉన్నాయని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించడం ఉంది. 'ఉదాహరణకు, ప్రపంచ ఆకలి సూచి ఇప్పుడు ముఖ్యాంశాలు చేస్తుంది. చాలా మంది ప్రజలు దానిని అంతా దుష్ప్రచారం అని అన్నారు. వారు ఆ సూచికను ఎలా నిర్మిస్తారు? 140 కోట్ల దేశంలో మూడు వేల మందికి ఫోన్ కాల్ వచ్చింది. వారిని 'మీకు ఆకలిగా ఉందా?' అని ప్రశ్నించారా అని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సదస్సులో ఇరానీ మాట్లాడుతూ భారత్ కంటే పాకిస్తాన్ మెరుగ్గా పనిచేస్తోందని ఆ సూచీ చెబుతోందని, మీరు ఊహించగలరా? అని ఆమె ప్రశ్నించారు.

యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం

చిన్నారి సహా ఐదుగురి దుర్మరణం

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే వద్ద మారుతి వ్యాన్ అదుపుతప్పి గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక చిన్నారి సహా ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు మైనర్లు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదం శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం సమయంలో వ్యానులో 8 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు.

కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుంది

బీజేపీ నేత వ్యాఖ్య

బెంగళూరు: తప్పుడు హామీలతో కర్నాటకలో అధికారాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలు వచ్చేలోగా గల్లంతు కావడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ ఈశ్వరప్ప సంచలన వ్యాఖ్యలు చేశారు. నగరంలోని విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అలవికాని హామీలతో ఇప్పటికే ఆర్థికంగా సతమతమవుతున్న ప్రభుత్వానికి ఎక్కువ కాలం ప్రభుత్వాన్ని నడిపే సమర్థత కరువైందని ఎద్దేవా చేశారు. దీనికితోడు ఇప్పటికే ముఠా ఘర్షణలు తారా స్థాయికి చేరాయని ఎవ్వరు ఉంటారో ఎవ్వరు వెళ్తారో చెప్పలేమంటు పరోక్షంగా సతీశ్ జారకి హోళి ఉదంతం గురించి వ్యాఖ్యానించారు. కాగా తన చావుకు మంత్రి శరణప్రకాశ్ పాటీల్ కారణమంటు బీజేపీ కార్యకర్త ఒకరు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో మంత్రి పదవి నుంచి వైదొలగాలని ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన ఆరోపణల సందర్భంగా ప్రధానమంత్రి, హోం మంత్రిలకు స్వయంగా తానే లేఖలు రాసి పదవి నుంచి తప్పుకున్నట్లు ఈశ్వరప్ప గుర్తు చేశారు.

కర్నాటకలో బీజేపీకి బిగ్ షాక్

కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత

బెంగళూరు: కర్నాటకలో బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే పూర్ణిమ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం కేపీసీసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆమెను పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. పూర్ణిమతో పాటు భర్త శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ నరసింహనాయక్‌కు కూడా కాంగ్రెస్ కండువాలు వేశారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ పూర్ణిమ బాల్యం నుంచి కాంగ్రెస్‌కు చెందినవారే అన్నారు. ఆమె తండ్రి ఎ.క్రిష్ణప్ప సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్‌లో ఎన్నో పదవుల్లో కొనసాగారని తెలిపారు. కొన్ని కారణాలతో క్రిష్ణప్ప పార్టీని వీడారన్నారు. పూర్ణిమ కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేసే పార్టీ అన్నారు. డీకే శివకుమార్ మాట్లాడుతూ కలిసి రాజకీయాలు చేశామని, కొన్ని కారణాలతో వారు మరో పార్టీలోకి వెళ్లారన్నారు. పూర్ణిమ, శ్రీనివాస్ దంపతులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు సుదీర్ఘకాలంగా ప్రయత్నించానని, నేటితో సాధ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెసలో చేరేవారి జాబితా ఎక్కువగా ఉందని ప్రస్తుతం చెప్పలేనన్నారు.

దివ్యాంగ వధువుకు చేదు అనుభవం

ముంబై: చక్రాల కుర్చీపై ఉండే ఓ దివ్యాంగురాలు తన పెళ్లి కోసం మ్యారేజి రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్న భవనానికి చేరుకోగా ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. కార్యాలయం రెండవ అంతస్తులో ఉండటంతో, భవనంలో లిఫ్ట్ లేకపోవడం సమస్యగా మారింది. అధికారులు కిందికి వచ్చి వివాహాన్ని నిర్వహించేందుకు నిరాకరించారు. దీంతో ఆమెను ఎత్తుకొని మెట్లపై నుంచి మోసుకొని కార్యాలయానికి చేర్చాల్సి వచ్చింది. దీంతో పెళ్లి తంతు ముగిసింది. అయితే తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వధువు విరాలీ మోదీ ఎక్స్ మాధ్యమంలో పంచుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'అంతా సవ్యంగా జరిగింది కాబట్టి పర్వాలేదుగానీ ఎదైన అపశ్రుతి దొర్లివుంటే ఎవరు బాధ్యత వహిస్తారు? రెండవ అంతస్తులో కార్యాలయం ఉన్నప్పుడు లిఫ్ట్ ఎందుకు లేదు? ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుందామని వెళ్లానుగానీ ఇలాంటి చేదు అనుభవం ఎదురవుతుందని ఊహించలేదు. సంతకాల కోసం అధికారులు కిందకు దిగి వచ్చేందుకు నిరాకరించారు.

నేను దివ్యాంగురాలిని... నా విషయంలో ఇలాంటి ప్రవర్తన న్యాయమేనా! నన్ను మోసుకొని రెండు అంతస్తులు పైకి ఎక్కాల్సి రావడం బాధాకరం. మోసేవారు లేక నేను కింద పడివుంటే ఏమయ్యేది' విరాలీ మోదీ పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఖార్ ముంబైలోని రిజిస్టార్ కార్యాలయంలో ఈనెల 16న ఆమె వివాహం జరిగింది. అయితే విరాలీ మోదీ ట్వీట్‌పై ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్ స్పందించారు. 'కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నందుకు శుభాకాంక్షలు... మీ వైవాహిక జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షిస్తున్నా. మీకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తున్నా. దీనిని నేను పర్యవేక్షిస్తా... అవసరమైన చర్యలు తీసుకుంటా' అని విరాలీ మోదీకి ట్వీట్ చేశారు.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు షురూ

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి వచ్చే నెలలో పోలింగ్ జరగబోతోంది. ఈ క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్ శనివారం ఉదయం జారీ అయింది. దీంతో నామినేషన్లను దాఖలు చేసే ప్రక్రియ ప్రారంభమైందని ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో నవంబరు 17న ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు డిసెంబరు 3న జరుగుతుంది. 230 స్థానాలు ఉన్న శాసనసభ కోసం నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలు కాగా ఈనెల 30 వరకు సమయం ఉంటుంది. 31వ తేదీన పత్రాల పరిశీలన జరుగుతుంది. నవంబరు 2లోగా నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. రాష్ట్రంలో 5.60 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉంటే వీరిలో 2,88,25.607 మంది పురుషులు, 2,72,33,945 మంది మహిళలు, 1,273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సర్వీస్ ఓటర్ల సంఖ్య 75,303గా ఉంది.

సీనియర్ సిటిజన్లు 6,53,640 మంది, దివ్యాంగ ఓటర్లు 5,05,146 మంది, ఎన్‌ఆర్ఐలు 99 మంది చొప్పున ఉన్నారు. సర్వీస్ ఓటర్లను కలుపుకంటే రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5,61,36,229. అయితే ఓటర్ల జాబితాలను సవరించిన తర్వాత 16,83,790 మంది పేర్లు కొత్తగా చేర్చారు. ఇదిలావుంటే కాంగ్రెస్ ఇప్పటికే 229 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. బీజేపీ 136 మంది అభ్యర్థిత్వాన్ని ప్రకటించగా బీఎస్పీ, ఎస్పీ, ఆప్ కూడా పోటీలో ఉన్నాయి.

సీఎం, మంత్రులు పొలం బాటపట్టాలి

- కర్నాటక సీఎంని చూసి జగన్ నేర్చుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర - బళ్లారి: ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు పొలం బాట పట్టి రైతులను ఆదుకోవాలనీ, కర్నాటక ముఖ్యమంత్రిని చూసి అయినా సీఎం జగన్ బుద్ధి తెచ్చుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ కోరారు. శనివారం బళ్లారిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎండిపోయి పంటలను గత రెండు రోజులుగా పరిశీలించినట్లు తెలిపారు. ముఖ్యంగా కంది, పత్తి, ఆముదాల వంటి వాణిజ్యపంటలు ఎండిపోగా, సత్యసాయి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయలేదన్నారు. పంటలు వేసిన రైతులు సుమారు రూ 20,000 నుంచి రూ 50,000 పెట్టుబడులు పెట్టి నష్టపోయారని తెలిపారు. కనీసం ఆయకట్టు భూముల్లో కూడా పంటలు వేయలేని పరిస్థితి ఉందన్నారు. తుంగభద్ర ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడగా ఎల్ఎల్‌సీకి రావలసిన నీటివాటాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా 24 టీఎంసీలకు 11.99 టీఎంసీలు, హెచ్ఎల్‌సీ నుంచి రావలసిన 32.5 టీఎంసీలకు 16 టీఎంసీలు నీరు ఇచ్చేందుకు అవకాశం ఉందని ప్రాజెక్టులో నీళ్లు లేనందున సాగునీటికి కాకుండా

తాగునీటి ఇబ్బందులు తీర్చుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. పంటలు పండించుకునేందుకు నీటి అవకాశాలు లేకుండా పోయాయని తెలిపారు. శ్రీశైలం - సాగర్ , కృష్ణాడెల్టా క్రింద ఈ ఏడాది పంటలు సాగు చేసే అవకాశం లేకుండా పోయిందనీ, ఇప్పటికే ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. గతంలో ఏనాడు ఇంత దుర్భర పరిస్థితులు రాలేదన్నారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎవరూ కూడా పంటలు పరిశీలించి రైతులను ఆదుకునేందుకు ఎటువంచి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కర్నాటక ముఖ్యమంత్రి గత నెలలోనే కరువు మండలాలను ప్రకటించారనీ, కేంద్ర బృందాలు అక్టోబరు మొదటి వారంలో పంటలను పరిశీలించి వెళ్లాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిద్ర పోతున్నారా లేక నిద్రపోతున్నట్లు నటిస్తున్నారా అని రామకృష్ణ ప్రశ్నించారు. పక్కరాష్ట్రంలో కేంద్ర కరువు బృందాలు పర్యటించి వెళ్లాయనీ, వెంటనే మంత్రులు, సీఎం ,ప్రజాప్రతినిధులు పొలం బాట పట్టాలన్నారు.

మాటలకందని విషాదం

- మూడు గంటలు గర్భిణికి నరకయాతన
- రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

విశాలాంధ్ర-కారంపూడి: పల్నాడు జిల్లా కారంపూడిలో విషాదం చోటుచేసుకుంది. భార్యకు పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తరలించగా..వైద్యం కోసం డబ్బు తెచ్చేందుకు వెళ్లిన భర్త..తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఆసుపత్రిలో సదుపాయాలులేవని చెప్పి గర్భిణిని మూడు గంటలుగా మూడు ఆస్పత్రుల చుట్టూ 70 కి.మీ మేర తిప్పడంతో ఆమె నరకయాతనపడింది. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన రామాంజిని అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం రాత్రి 10గంటలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సదుపాయాలు సరిగా లేవని గురజాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సూచించారు. దీంతో రాత్రి 11 గంటలకు గురజాల ఆస్పత్రికి వెళ్లారు. ఇక్కడ కూడా వైద్య సదుపాయాలు సరిగా లేవని 70 కి.మీ. దూరంలో ఉన్న నరసారావుపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సిఫార్సు చేశారు. నరసరావుపేట ఆస్పత్రి వద్దకు చేరగానే రామాంజిని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇదే క్రమంలో కారంపూడి నుంచి గురజాల వరకు తోడుగా వచ్చిన ఆమె భర్త ఆనంద్ (40).. ఇంటికి వెళ్లి డబ్బులు తెస్తానని బయలుదేరాడు. బైక్‌పై ఇంటికి వెళ్లి తిరిగొస్తూ మార్గమధ్యంలో జోలకల్లు వద్ద రహదారిపై ఉన్న పెద్ద గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆనంద్‌ను నరసరావుపేటకు తరలించారు. ఆస్పత్రి వద్దకు చేరగానే ఆనంద్ బిడ్డను చూడకముందుకే కన్నుమూశారు.

యుద్ధాన్ని ఆపడమే లక్ష్యం

కైరోలో శాంతి శిఖరాగ్ర సదస్సు

కైరో: ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య యుద్ధం పక్షం రోజులుగా భీకరంగా జరుగుతోంది. రోజురోజుకూ పరిస్థితులు క్షీణిస్తుండటం దృష్ట్యా ఎలాగైన యుద్ధాన్ని ఆపడమే లక్ష్యంగా శాంతి సమావేశానికి ఈజిప్టు పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్‌కు ఈజిప్టుకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇదే క్రమంలో ఈజిప్టు రాజధాని కైరోలో శాంతి శిఖరాగ్ర సదస్సు జరిగింది. అరబ్ దేశాలతో పాటు అమెరికా, ఇజ్రాయిల్, పలస్తీనా, రష్యా, చైనా, స్పెయిన్, గ్రీస్, దక్షిణాఫ్రికా, బ్రిటన్, జపాన్, నార్వే దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని ఇజ్రాయిల్-హమాస్‌కు మధ్య సంక్షోభ పరిస్థితిని నివారించడంపై చర్చించారు. పలస్తీనా భవిష్యత్తు గురించి సమాలోచనలు జరిగాయి. వీటి మధ్య ఐక్యతను పెంపొందించడం, ఘర్షణకు శాంతియుతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈనెల 7న నుంచి జరిగిన దాడుల్లో ఇప్పటికే 4,100 మందికి పైగా మరణించారు. గాజాలో మానవతా సంక్షోభం పెరిగింది. 23 లక్షల జనాభా ఉన్న గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడులు చేస్తూ ముట్టడి చేయడంపై అరబ్ దేశాలు అసహనం వ్యక్తం చేశాయి. ఐరోపా దేశాలు ఐక్యతను నెలకొల్పేందుకు యత్నిస్తున్నాయి. హమాస్‌పై యూరోపియన్ దేశాలు తీవ్ర విమర్శలు చేశాయి. శాంతి సమావేశంలో పలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, జోర్డాన్ రాజు అబ్దుల్లా, బెహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, ఖతార్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిత్సోటాకిస్- సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, బ్రిటన్, నార్వే, రష్యా దేశాల విదేశాంగ మంత్రులు, అధికారులు అన్నలెనా బేర్‌బాక్, కేథరీన్ కొలోనా, యోకో కమికావా, జేమ్స్ క్లెవర్లీ, ఎస్పెన్ బార్త్ ఈడే, మిఖాయిల్ బొగ్దనోవ్, చైనా రాయబారి జై జున్- ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్, ఈయూ అధ్యక్షుడు చార్లెస్ మిచెల్ తదితరులు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో రైతాంగం

- వారిని తక్షణమే ఆదుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి ముప్పాళ్ల డిమాండ్

విశాలాంధ్ర-అచ్చంపేట: వర్షాభావంతో నష్టపోయిన రైతులను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని సీపీఐ ఏపీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు శనివారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 18 జిల్లాలలో వర్షభావంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. 122 ఏళ్ల కిందట సంభవించిన కరువు తరహా పరిస్థితి గత ఆగస్టులో సంభవించిందని గుర్తుచేశారు. ఈ విపత్కర పరిస్థితులలో లక్షలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారందరినీ తక్షణమే ఆదుకోవాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అచ్చుపేట మండలంలో వివిధ వాణిజ్య పంటలతో పాటు మిర్చి, వరి, పత్తి పంటలను పరిశీలించారు. గతంలో శ్రీశైలం డ్యామ్‌లో 213 టీఎంసీ నీరు నిల్వవుంటే ప్రస్తుతం 75 టీఎంసీలే ఉందని ముప్పాళ్ల తెలిపారు. నాగార్జునసాగర్‌లో 38 టీఎంసీలు ఉంటే ప్రస్తుతం 162 టీఎంసీల నీరు ఉందన్నారు. పులిచింతల ప్రాజెక్టులో గతంలో 42 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 29 టీఎంసీలు ఉందని తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రాజెక్టులపై పెత్తనం చెలాయిస్తున్న కేంద్రప్రభుత్వం... కర్నాటకలోని ఆల్మట్టి నుంచి దిగువ రాష్ట్రాలకు నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నాటకలో ఎగుభద్ర ప్రాజెక్టును రూ.5300 కోట్లతో నిర్మించి ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమను ఎడారిగా మార్చారని విమర్శించారు. ఇప్పుడు కృష్ణ నీటిపై కొత్త జీవో ప్రవేశపెట్టి తెలంగాణ ప్రాజెక్టులకు అక్రమంగా తరలించేందుకు కేంద్రం చర్యలు చేపట్టడం వల్ల దిగువ ప్రాంతమైన ఆంధ్రప్రదేశ్ ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో నీటినిల్వ వల్ల దిగువ ప్రాంతాలలో సాగు నీరు లేక లక్షలాది ఎకరాలు ఎండిపోతే రైతులకు నష్టాలు తప్పవన్నారు. నకిలీ విత్తనాలతో కల్తీ పురుగు మందులతో రైతు తీవ్రంగా కుంగిపోతుంటే 'దున్నపోతు మీద వర్షం' చందంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించే తీరు క్షమించరానిదని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఢిల్లీ పెత్తనంతో కృష్ణ బేసిన్‌పై దుర్మార్గపు చర్యలు తగదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన వాటాపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. అఖిలపక్షంలో సీపీఐ దాని అనుబంధ సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉంటుందని, దిగువ ప్రాంతానికి నీరు అందించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించే ఉదాసీనతను ఎండగట్టేందుకు యావత్తు రైతాంగం, ప్రజలు ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, నాయకులు శివశంకర్, సుభాని, ఏడుకొండలు పాల్గొన్నారు.

చర్చల్లో రాజ్యాంగ విలువలకు కట్టుబడి మాట్లాడండి

పార్టీ అధికార ప్రతినిధులతో పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: మీడియా సమావేశాలు, టీవీ చర్చల్లో పాల్గొనే జనసేన ప్రతినిధులు రాజ్యాంగ విలువలకు కట్టుబడి పాలనాపరమైన విధివిధానాలు, ప్రజోపయోగ అంశాల మీద మాత్రమే మాట్లాడాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ అధికార ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పార్టీ నిర్దిష్ట అభిప్రాయాలను వారికి తెలియచేశారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎవరైనా ఒక నాయకుడు ప్రభుత్వ విధానాలకు ఆటంకం కలిగించినప్పుడు అతను చేసిన తప్పుల గురించి బలంగా ప్రస్తావించాలన్నారు. కులాలు, మతాలు గురించి మాట్లాడవలసినప్పుడు రాజ్యాంగానికి లోబడి మాత్రమే మాట్లాడాలని అన్నారు. అన్ని మతాలను ఒకేలా గౌరవించాలని, దేవాలయం లేదా చర్చి లేదా మసీదులపై దాడులు జరిగినప్పుడు ఒకేలా స్పందించాలన్నారు. ముఖ్యంగా టీవీ చర్చలకు వెళ్లే వారు రాజకీయాలు, సమకాలీన అంశాలు, ప్రజా సమస్యలు మొదలగు ముఖ్యమైన అంశాలన్నింటిపైనా లోతుగా అధ్యయనం చేసి తగిన సమాచారం సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనవసర విషయాలు, వ్యక్తిగత దూషణలు సమాజానికి హానిచేసే విధంగా చర్చలు ఉండకూడదన్నారు. చర్చల్లో వ్యక్తిగత విషయాలను గురించి మాట్లాడకపోవడంతో పాటు అవతలి వారి ఆహార్యం గురించో, బాడీ షేమింగ్ చేసే విధంగానే ఎటువంటి పరిస్థితుల్లో మాట్లాడకూడదన్న నియమాన్ని పాటించాలన్నారు. సోషల్ మీడియాకు అనవసరమైన ఇంటర్వూలు ఇవ్వొద్దని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక సమాచారాన్ని నిర్ధారించుకోకుండా మరొకరికో లేదా పార్టీ కార్యాలయానికి పంపడమో, దానిపై హడావిడి చేయడమో వద్దని అన్నారు. పార్టీ ప్రతినిధులు కేవలం పార్టీ కోసం మాత్రమే మాట్లాడాలన్నారు. నా సినిమాలు, కుటుంబ సభ్యులపై వచ్చే విమర్శలపై కూడా స్పందించవద్దన్నారు. మన పార్టీ కమ్యూనిస్టులతో కలసినా, బీజేపీతో కలిసినా, టీడీపీతో పొత్తు ఉన్నా అది రాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికే అనే విషయాన్ని చర్చల్లో అవసరమైన సందర్భాల్లో ప్రస్తావించాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో అధికార ప్రతినిధుల పాత్ర మరింత ఎక్కువగా ఉంటుందని, పార్టీ అభిప్రాయాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సింది అధికార ప్రతినిధులేనని తెలిపారు. ఈ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి వచ్చే నెలలో ఒక వర్క్ షాప్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ తదితరులు పాల్గొన్నారు. అధికార ప్రతినిధులకు సంబంధించిన వర్క్ షాప్ నిర్వహణకు టి.శివశంకర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. వేములపాటి అజయ్, బుర్రా నాగ త్రినాథ్, కోటంరాజు శరత్ సభ్యులుగా ఉంటారు.

గాజాకు 20 ట్రక్కుల 'సాయం'

జెరూసలేం: ఇజ్రాయిల్ దాడులతో సర్వం కోల్పోయిన పలస్తీనా ప్రజలకు స్వల్ప ఊరట లభించింది. యుద్ధం కారణంగా ఆకలి దప్పికలతో అల్లాడిపోతున్న వారికి తమ ప్రాణాలను నిలుపుకునేందుకు మానవతా సాయం అందబోతోంది. ఈజిప్టు నుంచి రాఫా సరిహద్దు గుండా గాజాలోకి శనివారం మానవతా సాయంతో ట్రక్కులు ప్రవేశించాయి. ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధం మొదలైన 15 రోజులకు మానవతా సాయం గాజా ప్రజలకు చేరబోతోందని ఈజిప్టు రెడ్ క్రిసెంట్ అధికారి తెలిపారు. ట్రక్కులు సరిహద్దు దాటుతున్న దృశ్యాలను ఈజిప్టు ఛానళ్లు ప్రసారం చేశాయి. ఐరాస సంస్థల సహాయ సామాగ్రితో 20 ట్రక్కులు ఈజిప్టు టెర్మినల్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నాయి. 36 ఖాళీ ట్రెలర్లు ఈజిప్టు వైపునకు కదలాయని, అందులో సహాయ సామాగ్రిని నింపి గాజాకు తరలిస్తారని పలస్తీనా వైపు నుంచి ఏఎఫ్‌పీ జర్నలిస్ట్ ఒకరు నివేదించారు. నాలుగు అంబులెన్సులు, రెండు ఐరాస వాహనాలతో పాటు రెండు రెడ్ క్రాస్ వాహనాలు కూడా టెర్మినల్‌లోకి వెళ్లాయని చెప్పారు. కార్గో విమానాలు, ట్రక్కుల్లో ఈజిప్టుకు సహాయ సామాగ్రి చేరుకుంటోంది. ఈజిప్టు నుంచి సహాయ సామాగ్రి తరలింపునకు చేసిన ఏర్పాట్లను శుక్రవారం ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పరిశీలించారు. ఇవి ట్రక్కులు కాదు గాజా ప్రజలకు జీవనరేఖలని, ఎందరికో ప్రాణాలు నిలిపే సాధనాలని ఆయనన్నారు. కాగా, రాఫా సరిహద్దు వద్ద 3వేల టన్నుల సహాయ సామాగ్రితో 200కుపైగా ట్రక్కులు నిలిచివున్నాయి.



ఈ నెల 20-22 తేదీల్లో టర్కీలోని ఇజ్మీర్‌లో జరిగిన కమ్యూనిస్టు & వర్కర్స్ పార్టీల 23వ అంతర్జాతీయ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కాంగో

25 నుంచి 30 వరకు గ్రామ సచివాలయాల ముందు ధర్నాలు

జయప్రదానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో కరువు పరిస్థితుల నుండి వ్యవసాయ కూలీలు,పేదలు, రైతులు కుటుంబాలను ఆదుకోవడానికి తక్షణమే కరువు పరిస్థితులను అంచనా వేసి, కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నెల 25 నుంచి 30 వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జల్లివిల్సన్, అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అనావృష్టి కారణంగా ఈ సంవత్సరం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రాయలసీమతో పాటు ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యంత దారుణంగా కరువు నెలకొన్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా తీరం పక్కన వున్న జిల్లాల్లో కూడా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని " డౌన్ టూ ఎర్త్" అనే సంస్థ విశ్లేషణ చేసిందని పేర్కొన్నారు. కరువు నుంచి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి వలసలు ఆపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రధానంగా వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపాధి చూపి ఆకలి తీర్చి, వలసలను ఆపి ఆర్థిక చేయూతనందించాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితులను నివారించడానికి మీనమేషాలు లెక్కపెడుతున్నాయని విమర్శించారు. ఇంత తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం గాని, ప్రభుత్వాధికారులు గాని కరువు పరిస్థితులను అంచనా వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కరువు నుంచి వ్యవసాయ కూలీలను, పేదలను, రైతులను ఏ విధంగా ఆదుకోవాలో ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు,పేదల కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్ తో పాటు నెల నెలా 35 కిలోల బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని, పేద విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలన్నారు. పేదల ఇళ్లకు వస్తున్న కరెంట్ బిల్లులను, బకాయిలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వేసిన పంటలకనుగుణంగా పంట నష్టం ఇవ్వాలని, అన్ని రకాల బ్యాంకు రుణాలు రద్దు చేసి తిరిగి కొత్త అప్పులు ఇవ్వాలని కోరారు. పశువులకు మేత, నీరు ఉచితంగా అందించాలన్నారు. కరువు,వలసల నుంచి రక్షించుకోవడానికి గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్రానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు,రోజు వేతనం 600/- రూపాయలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి తగిన నిధులు విడుదల చేయాలన్నారు. వలసలు వెళ్లిన కుటుంబంలోని పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వమే ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వలసలు వెళ్లిన కుటుంబాలను తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల నుంచి వ్యవసాయ కూలీలను, రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

'పనామా లీక్స్' నిందితుడిపై ఈడీ చార్జిషీటు

న్యూఢిల్లీ: పనామా పేపర్ లీక్స్ కేసు నిందితుడిపై విదేశాల్లో అక్రమాస్తులు కలిగివున్నట్లు మనీలాండరింగ్ చట్టం కింద చార్జిషీటు దాఖలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం తెలిపింది. భోపాల్‌లోని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కోర్టులో నిందితుడు సంజయ్ విజయ్ షిండే, ఆయన భార్య అపర్ణ, వీనస్ బే ఆఫ్‌షోర్ లిమిటెడ్ కంపెనీపై ప్రాసిక్యూషన్ ఫిర్యాదు ఈనెల 18న నమోదైంది. న్యాయస్థానం శుక్రవారం చార్జిషీటును పరిగణనలోకి తీసుకుంది. నల్లధనం వ్యతిరేక చట్టం కింద గతంలో ఆదాయపు పన్ను శాఖ దాఖలు చేసిన చార్జిషీటు ఆధారంగా షిండేపై మనీలాండరింగ్ కేసు నమోదైంది. పనామా పేపర్స్ లీక్ విచారణలో భాగంగా అతనిపై ఐటీ శాఖ చర్యలు తీసుకుంది. పనామా కేసులో ప్రపంచ నేతలు, సెలబ్రిటీల పేర్లు ఉన్నాయి. భారత్‌కు సంబంధించి 426 కేసులున్నాయి. అయితే పన్నుఎగవేతదారులకు స్వర్గధామంగా చెప్పే బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్ (బీవీఐ)లో వీనస్ బే ఆఫ్‌షోర్ లిమిటెడ్ అనే కంపెనీని షిండే పెట్టారని ఈడీ తెలిపింది. ఈ కంపెనీకి చెందిన సింగపూర్‌లోని యూబీఎస్-ఏజీ బ్యాంకు ఖాతా ద్వారా రూ.21,87 కోట్లు పొందాడు. ఈ కంపెనీకి ఆయన ఒక్కటే డైరెక్టర్, భాగస్వామి, యజమాని. డబ్బుకు సంబంధించి పత్రాలు లేకపోవడం దీనిని అక్రమ సొత్తుగా అధికారులు పరిగణించారు. బీవీఐ కంపెనీ ద్వారా ఎన్‌ఆర్‌ఈ/ఎన్‌ఆర్‌ఓ ఖాతాల ద్వారా భారత్‌లోకి డబ్బును తీసుకొచ్చి ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్‌ఆర్-ఎఫ్‌డీ) ఖాతాలో జమచేసినట్లు ఈడీ వెల్లడించింది. ఈ నిధులను క్రమంగా అనేక స్థిర, చరాస్తుల కొనుగోలు కోసం వాడినట్లు ఆరోపించింది. భోపాల్, గోవా, వడోదరా, ముంబైలో ఆస్తులను నిందితుడు కొనుగోలు చేసినట్లు ఈడీ తెలిపింది. మ్యుచువల్ ఫండ్స్, షేర్‌లు, ఎఫ్‌డీలు, ఎల్ఐసీ పాలసీలతో పాటు వ్యాపారంలో మూలధన పెట్టుబడులుగా ఈ నల్లధనాన్ని వాడినట్లు పేర్కొంది. మొత్తం రూ.34.22 కోట్ల అక్రమ సొత్తును గుర్తించామని తెలిపింది.

25 నుంచి హైకోర్టుకు దసరా సెలవులు

వెకేషన్ బెంచీలకు అత్యవసర కేసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయదశమి సందర్భంగా రాష్ట్ర హైకోర్టుకు దసరా సెలవులు ప్రకటించారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు సెలవులు ఇస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు నోటిఫికేషన్ జారీచేశారు. హైకోర్టు కార్యకలాపాలు తిరిగి ఈ నెల 30న ప్రారంభమవుతాయి. ఈ సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు వెకేషన్ బెంచ్‌లను ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేశారు. వెకేషన్ కోర్టు జడ్జిలుగా జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఏవీ రవీంద్ర బాబు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ఉంటారు. జస్టిస్ వెంకటేశ్వర్లు, జస్టిస్ రవీంద్రబాబు ధర్మాసనంలో కేసులను, జస్టిస్ జ్యోతిర్మయి సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. హెబియస్ కార్పస్, బెయిల్స్, ముందస్తు బెయిలు, ఇతర అత్యవసర వ్యాజ్యాలపై వెకేషన్ జడ్జిలు విచారల్సి ఉంటుంది. అత్యవసర కేసులను 25న దాఖలు చేయాల్సి ఉంటుంది. అలా దాఖలైన వ్యాజ్యాలను 27న విచారిస్తారని నోటిఫికేషన్ పేర్కొంది.

నాలుగేళ్ల తర్వాత స్వదేశానికి

- పాకిస్తాన్ చేరుకున్న నవాజ్ షరీఫ్
- పీఎంఎల్-ఎన్ ఘనస్వాగతం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌కు మూడుసార్లు ప్రధాని, పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ నాలుగేళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్నారు. దేశంలో ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ఆయన మళ్లీ క్రియాశీల రాజకీయాల్లో రాబోతున్నారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. 73ఏళ్ల నవాజ్ షరీఫ్ దుబాయి నుంచి నేరుగా ఇస్లామాబాద్‌కు చార్టర్డ్ ఫైట్ 'ఉమ్మీద్ ఎ పాకిస్తాన్'లో వచ్చారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు, మిత్రులు ఉన్నారు. నవాజ్ షరీఫ్ అనేక కోర్టు కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల పాటు అజ్ఞాతవాసం (లండన్)లో గడిపారు. ఇస్లామాబాద్ చేరుకున్న ఆయనకు పీఎంఎల్-ఎన్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పాకిస్తాన్ క్లిష్ట సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఉంది. తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నవాజ్ షరీఫ్‌కు ప్రధాన ప్రత్యర్థి, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. 2024 జనవరిలో ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. నవాజ్ షరీఫ్ తిరిగి రావడంతో పాకిస్తాన్‌కు మంచి కాలానికి సంకేత మని, ఇది సంబరాలు చేసుకోవాల్సిన సమయమని పీఎంఎల్-ఎన్ సీనియర్ నేత ఖ్వాజా మహమ్మద్ ఆసిఫ్ అన్నారు. నవాజ్ షరీఫ్ నాలుగేళ్ల తర్వాత పాకిస్తాన్‌కు రావడంతో గ్రేటర్ ఇక్బాల్ పార్క్ వద్ద ర్యాలీకి ఏర్పాట్లు జరిగిన నేపథ్యంలో అక్కడకు వచ్చే వారిని అదుపు చేసేందుకు సుమారు ఏడు వేల మందికిపైగా పోలీసులను మోహరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.